ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నేటితో ముగుస్తున్న గడువు 4

మరో 12 ఎకరాలు కొన్న పవన్

» పిఠాపురం పట్టణ శివారులో కొనుగోలు

మెయిన్‌లో..

ఈస్ట్ కేజీఎఫ్.. వంతాడ

వంతాడకు వెళ్లే ఘాట్ రోడ్డు తరహా రహదారి





వంతాడలో రచ్చబండ సమావేశాలు జరిగే రావిచెట్టు

రిజర్వ్‌ఫారెస్ట్‌లోని ఓ చిన్న గిరిజన తండా ఇది.. 500పైచిలుకు మాత్రమే జనాభా మాత్రమే ఉండే ఈ ప్రాంతం పేరు రెండు దశాబ్దాలుగా తరచూ వినిపిస్తోంది. అదే వంతాడ.. ఇక్కడకు వెళ్లడం కష్టం.. ఇక్కడ ఉండడం కష్టం.. కారణం.. లాటరైట్ మైనింగ్.. ఈస్ట్ కేజీఎఫ్ లాంటి ఈ ప్రదేశం గురించి తెలుసుకోవాలంటే లోపలికి వెళ్లి చదివేయండి మరి... 4

- లేటరైట్ గనులకు ప్రసిద్ధి వంతాడ
- ఏడాది పొడవునా లేట.. రైట్
- రవాణాకు ప్రత్యేక రైల్వేస్టేషన్
- రావికంపాడు టూ ఒడిశా తరలింపు
- అయినా ఇక్కడ కానరాని మౌలిక వసతులు

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యాచరణ

- కాకినాడ కలెక్టరేట్‌లోనే నామినేషన్ల స్వీకరణ 4
- నామినేషన్ల దాఖలుకు ఆరు జిల్లాల నుంచి కాకినాడ కలెక్టరేట్‌కు రావాల్సిందే
- కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు

భక్తి, శ్రద్ధలతో నాగులచవితి 6



కాకినాడ కలెక్టరేట్‌లోని పుట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు

పాపం పండింది

వైసీపీ నేత, మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు ఉచ్చు బిగుస్తోంది. ఓ హత్య కేసు నుంచి తప్పించుకోవడానికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజా అన్ని రకాలుగా ప్రయత్నించగా ఇప్పుడు అవన్నీ బెడిసికొట్టాయి. చివరకు అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించినా తాజాగా హైకోర్టు తిరస్కరించింది. ఈ నేపథ్యంలో చేసిన పాపానికి ఫలితంగా త్వరలో అరెస్ట్ కానున్నారు.



- ఆంధ్రజ్యోతి విలేకరి హత్య కేసులో ముందస్తు బెయిల్‌కు హైకోర్టు నో
- ఏక్షణమైనా అరెస్ట్ చేయనున్న పోలీసులు
- వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని దర్జాగా కేసు నుంచి తప్పించుకున్న రాజా
- అతడి ప్రమేయం ఉన్నా ఒత్తిళ్లతో కేసును నీరుగార్చేసిన పోలీసులు
- న్యాయం చేయాలంటూ ఎన్నికలముందు లోకేశ్‌ను కోరిన సత్యనారాయణ సోదరుడు
- న్యాయస్థానంలోనూ పోరాటం
- ప్రభుత్వ మారాక కేసు పూర్వాపరాలన్నీ తిరగదోడిన పోలీసులు
- దాడిశెట్టి రాజా ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించి ఏ1గా కేసు నమోదు

కాకినాడ/తుని, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పోలీసులపై ఒత్తిడి తెచ్చి హత్య కేసులో ఛార్జిషీటులో తన పేరు లేకుండా రాజా చక్రం తిప్పి తప్పించుకున్నారు. బాధిత కుటుంబం పోరాటంతో ఏ1గా రాజాపై పోలీసు కేసు నమోదైంది. కానీ మంత్రిగా ఉండడం, తమ ప్రభుత్వమే కావడంతో జగన్ సర్కారు ఈ కేసును నీరుగార్చేసింది. నిందితుడైన రాజాకు అడ్డంగా సహకరించింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో పోలీసులు చట్టప్రకారం వ్యవహరించడం మొదలుపెట్టడంతో మాజీ మంత్రి రాజా పాపం పండబోతోంది.

అధికారం అండతో అడ్డగోలుగా..

తుని నియోజకవర్గం తొండంగి మండలం ఆంధ్రజ్యోతి విలేకరిగా పనిచేసిన కాతా సత్యనారాయణ 2019, అక్టోబరు 15న హత్యకు గురయ్యారు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో రాత్రివేళ కొందరు అగంతకులు తుని వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న దాడిశెట్టి రాజా నివాసానికి దగ్గరలో లక్ష్మీదేవి చెరువుగట్టుపై మాటువేసి సత్యనారాయణను హతమార్చారు. ద్విచక్రవాహనంపై ఎస్.అన్నవరంలోని తన నివాసానికి చేరుకునే క్రమంలో కిరాయి రౌడీలు మారణాయుధాలతో సత్యనారాయణను అతి కిరాతకంగా హతమార్చడం అప్పట్లో సంచలనమైంది. ఈ సంఘటనపై అప్పట్లో ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు తునిలో ఆందోళన బాట పట్టాయి. ఈ హత్యకు వైసీపీ నేత దాడిశెట్టి రాజా సూత్రధారి అని మృతుడి కుటుంబసభ్యులు అప్పట్లో ఆరోపించారు. పైగా హత్యకు కొన్నిరోజుల ముందు సెప్టెంబరులో తనకు రాజా అనుచరుల నుంచి బెదిరింపు ఫోన్లు వస్తున్నాయంటూ ఆధారాలతో సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు మాత్రం రాజా ఒత్తిళ్లతో అసలు పట్టించుకోలేదు. సంచలనం రేకెత్తించిన ఈ కేసుపై తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దాడిశెట్టి రాజాతో పాటుగా ఆరుగురి నిందితులను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న దాడిశెట్టి రాజా కేసును నీరుగార్చడంతోపాటు తన తోపాటు కేసులో ఉన్న కొందరు అనుచరులను కేసు నుంచి బయట పడేసేందుకు తన అధికారం అడ్డం పెట్టుకున్నారు. కేసు నమోదైనా అరెస్ట్ అవకుండా అప్పటి అధికారపార్టీ పెద్దల ద్వారా పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. ఈలోపు మంత్రి వర్గ విస్తరణలో భాగంగా రాజాకు మంత్రి పదవి లభించింది. దీంతో కేసు మరింత నీరుగారిపోయింది. అసలే రాజా మంత్రి కావడంతో అప్పటి పోలీసులు రాజా జోలికి వెళ్లడానికి సాహసించలేదు. సరికదా రాజా కనుసన్నల్లో పని చేసి 2023లో దాఖలు చేసిన చార్జ్‌షీట్ నుంచి మంత్రిగా ఉన్న దాడిశెట్టి రాజా పేరును పోలీసులు తొలగించారు. అసలు రాజాకు హత్యతో సంబంధం లేదని బుకాయించారు. ఆర్థిక కారణాలతో హత్య జరిగిందంటూ కేసును తప్పుదోవ పట్టించి మమ అనిపించారు. దీనిపై న్యాయవాది అయిన సత్యనారాయణ సోదరుడు గోపాలకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజా పాత్రకు సంబంధించి ఆధారాలు, పలుసార్లు రాజా అనుచరులు తన సోదరుడిని బెదిరించిన ఘటనలకు సంబంధించిన వివరాలు న్యాయస్థానానికి అందించారు. అప్పటి వైసీపీ ప్రభుత్వ ఆదేశాలతో రాజా జోలికి పోలీసులు వెళ్లలేదు.

ప్రభుత్వం మారడంతో..

ఇటీవల అసెంబ్లీ ఎన్నికలకు ముందు నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో భాగంగా తునికి వచ్చారు. ఈ సమయంలో సత్యనారాయణ కుటుంబసభ్యులు లోకేశ్‌ను కలిసి తమ ఆవేదన వినిపించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. రాజా తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని కేసు లేకుండా చేసుకున్నారని వివరించారు. దీంతో లోకేశ్ స్పందిస్తూ కూటమి ప్రభుత్వంవచ్చిన తర్వాత తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే కూటమి ప్రభుత్వం రాగానే పోలీసులు మళ్లీ హత్య కేసును తిరిగి తెరిచారు. ఆధారాలున్నా సరే రాజాపై కేసు నమోదు చేయకుండా అప్పటి పోలీసులు వ్యవహరించారని తేల్చారు. దీంతో రెండునెలల కిందట తిరిగి దాడిశెట్టి రాజాపై పోలీసులు హత్య కేసులో ప్రధాన నిందితుడిగా కేసు నమోదు చేశారు. అధికారం పోవడంతో తనకు అరెస్ట్ తప్పదన్న భయంతో రాజా ముందస్తు బెయిల్‌కోసం హైకోర్టును ఆశ్రయించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయస్థానం రాజాకు ముందస్తు బెయిల్ నిరాకరించింది. పోలీసుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో వైసీపీ నేత దాడిశెట్టి రాజాను ఏక్షణమైనా పోలీసులు అరెస్ట్ చేయనున్నారు. రాజా మాజీ సీఎం జగన్‌కు సన్నిహితుడు. ఈ కేసులో రాజాను జగన్ వెనకేసుకు రావడంతోనే పోలీసులు అప్పట్లో హత్యకేసును నీరుగార్చేశారు. ఇప్పుడు పాపం పండనుండడంతో రాజా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

మహిళా రక్షక్ వాహనాలు...
ఈవ్‌టీజర్ల పాలిట సింహ స్వప్నాలు: ఎస్పీ

కాకినాడ క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈవ్‌టీజర్ల పాలిట సింహ స్వప్నాలుగా మహిళా రక్షక్ వాహనాలు దోహదపడతాయని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణం నుంచి ఆయన మంగళవారం మహిళా రక్షక్ వాహన సేవలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనాలపై ప్రత్యేక మహిళా పోలీస్ సిబ్బంది అన్ని కాలేజీలు, స్కూల్‌లు వెంబడి ర్యాలీగా బయలుదేరి వెళ్లి విద్యార్థులకు, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ మహిళా రక్షక్ వాహనాలు అన్ని పోలీస్‌స్టేషన్లలోను ఉంటామని, ఈ వాహనాలపై మహిళా కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్, పార్కులు, దేవాలయాలవద్ద రక్షణగా ఉంటారన్నారు. మహిళలకు, విద్యార్థులకు ఏ విధమైన సహకారం కావాల్సి వచ్చినా టోల్‌ఫ్రీ నెంబర్లు 112 లేదా 100 లేదా జిల్లా ఎస్పీ వాట్సాప్ హెల్ప్‌లైన్ నెంబర్ 9494933233కు ఫోన్ చేసి మహిళా రక్షక్ సహకారం, సేవలు పొందవచ్చన్నారు. ఈ మహిళారక్షక్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని, ఏ సమయంలోనైనా జిల్లాలోని ఏ ప్రాంతం నుంచైనా పైనెంబర్లకు ఫోన్ చేసి సహకారం పొందవచ్చన్నారు. ఈ మహిళా రక్షక్ టీమ్స్ మహిళలకు, విద్యార్థినులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, ర్యాగింగ్, పోక్సో చట్టాలు, మహిళా రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తాయన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఆర్.రామచంద్రరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



జెండా ఊపి రక్షక్ టీం వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

అదో కాళరాత్రి

» నవంబరు 6 అంటేనే కోనసీమ వాసులకు హడల్.. 4

సత్యదేవుడి తెప్పోత్సవ పంటుకు మరమ్మతులు పూర్తి 5

ఉల్లి ధర లొల్లి..

» కర్నూలుకు రేటు రాదు..

» మహారాష్ట్రకు పోటీ లేదు 5

సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా అమలు

» ఆ దిశగా కూటమి ప్రభుత్వం పయనం

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ

కాకినాడ సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా అమలు జరిగేలా కూటమి ప్రభుత్వం పయనిస్తోందని రాష్ట్ర మున్సిపల్‌శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో యువతకు ఉపాధి కల్పనకు మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నాయన్నారు. ప్రతి మూడునెలలకు ఒకసారి మూడు పార్టీల నాయకులతో కలిసి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కూటమి తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు కృషిచేయాలని మంత్రి నారాయణ సూచించారు. అంతకుముందు ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పార్టీల పరిస్థితి, కూటమి నేతల మధ్య సమన్వయం, ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశంలో చర్చించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ కూటమిలోని మూడు పార్టీల శ్రేణులు పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా మొదటిసారి కాకినాడ వచ్చిన నారాయణకు కూటమి పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడం వల్ల మంత్రి నారాయణ అధికారిక కార్యక్రమాలు కాకుండా కేవలం పార్టీ కార్యక్రమాలకే పర్యటనను పరిమితం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, కూటమి నేతలు తుమ్మల బాబు, వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, కటకంశెట్టి బాబి, బోళ్ల కృష్ణమోహన్, చప్పిడి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబు, మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్ వొమ్మి బాలాజీ, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

24గంటల వ్యవధిలోనే..
రైతుల ఖాతాలకు పరిహారం జమ

- పట్టు రైతుల సమస్యలపై శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి పర్యటన
- నష్టాలకు కారణాలపై అధ్యయనం
- డిప్యూటీ సీఎం చొరవతో సమస్యల పరిష్కారం దిశగా అడుగులు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టుగుడ్లు గూళ్ల కట్టక నష్టపోయిన రైతులకు 24గంటల వ్యవధిలోనే నష్టపరిహారం అందింది. రైతుల ఖాతాలకు జమయింది. పట్టుపరిశ్రమశాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తల బృందాలు రంగంలోకి దిగాయి. క్షేత్రస్థాయిలో పట్టురైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం ప్రారంభించాయి. ఇవన్నీ డిప్యూటీ సీఎం చొరవతో సాధ్యమయ్యాయి.

గొల్లప్రోలు మండలం చేబ్రోలు పరిసర గ్రామాల్లోని 200మంది పట్టురైతులు కర్నాటక రాష్ట్రంలోని రామ్‌నగర్‌నుంచి పట్టు గుడ్లు కొనుగోలు చేసి తెచ్చారు. గుడ్లనుంచి వచ్చిన పురుగులు గూడు కట్టకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పట్టుపరిశ్రమశాఖ ద్వారానే గుడ్లు సరఫరా చేయాల్సి ఉండగా వైసీపీ హయాంలో ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించారు. మూడేళ్లుగా పట్టుపురుగుల పెంపకంలో లక్షలాది రూపాయిలు నష్టపోతున్నా తమను ఎవ్వరూ పట్టించుకోవడం లేదనే వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ పట్టురైతులు ఆందోళనలు నిర్వహించారు.

పట్టుగూళ్ల కట్టక నాసిరకం గుడ్లతో పట్టురైతులు నష్టపోయిన విషయం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి వచ్చింది. సోమవారం పిఠాపురం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన పవన్ అంతకంటే ముందుగానే సెరీకల్చర్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. తక్షణం సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని, శాస్త్రవేత్తలను పంపాలని ఆదేశించారు. దీనితో పవన్ గొల్లప్రోలు సభలో పాల్గొన్న సమయానికే పట్టు శాస్త్రవేత్తలతోపాటు సెరీకల్చర్ అడిషనల్ డైరెక్టర్ అరుణకుమార్ అక్కడకు చేరుకున్నారు. వారిని వేదిక మీదకు పిలిచిన పవన్‌కల్యాణ్ తనకు వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన పట్టురైతులను ఉద్దేశించి మీరు నాకు వినతి ఇవ్వకుండానే మీ సమస్యలను పరిష్కరిస్తున్నానని ప్రకటించారు. అక్కడిక్కడే నష్టపరిహారంగా రూ.11.40లక్షలను చెక్కుగా అందజేశారు. ఇది జరిగి 24గంటలు గడవకుండానే 86మంది రైతులకు వారి ఖాతాలకు నష్టపరిహారం సొమ్ములు మంగళవారం ఉదయం 11గంటలలోపే పడ్డాయి. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. అడిషనల్ డైరెక్టర్ అరుణకుమార్, హిందూపురంలోని ఏపీ సెరీకల్చర్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌కి చెందిన శాస్త్రవేత్తలు, పెథాలజిస్టులు ఇబ్రహీం భాషా, శేషగిరిరావు, సీతారాములు, బ్రీడర్ స్పెషలిస్టు హర్షల్ చేబ్రోలు పరిసర గ్రామాల్లోని పట్టు షెడ్లు, మల్బరీతోటలను పరిశీలించారు. రైతులతో సమావేశమై పట్టుగూళ్లు కట్టకపోవడానికి గల కారణాలపై అధ్యయనం ప్రారంభించారు.

పదో తరగతి పరీక్షల ఫీజును 18లోపు చెల్లించాలి: డీఈవో

కాకినాడ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులకు పరీక్షరుసుము చెల్లింపునకు నామినల్ రోల్స్, డాక్యుమెంట్లను అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో ఈనెల 18లోపు సమర్పించాలని డీఈవో పి.రమేష్ తెలిపారు. రూ.50 ఆలస్యరుసుంతో 19నుంచి 25లోపు, రూ.200 ఆలస్య రుసుంతో డిసెంబరు 3లోపు, రూ.500 ఆలస్య రుసుంతో డిసెంబరు 10లోపు చెల్లించాలన్నారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

మేనేజర్ వ్యవహారంపై కలెక్టర్, డీఎంఈ ఆరా

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ పరిపాలనా విభాగ మేనేజర్ వైవీఎస్ఎన్ నరసింగరావు నర్సింగ్ పోస్టింగ్‌ల విషయంలో పాల్పడిన భారీ అవకతవకలపై కలెక్టర్ షాన్‌మోహన్, డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం మంగళవారం ఆరాతీశారు. ఈ మేరకు కలెక్టర్ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారితో కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో గంటకుపైగా సమావేశమయ్యారు. నరసింగరావు 2020లో అప్పటి కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించే రీతిలో నోట్ ఫైల్‌పై తన ఒక్కడి సంతకాలతోనే నోట్ ఫైల్ నడిపి లంచాలు తీసుకుని అనర్హులకు ఉద్యోగాలు వచ్చేలా చేశాడు. ఆ సమయంలో ఇతర అధికారుల సంతకాలు లేకుండా జాగ్రత్త పడి తన సంతకంతోనే కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి అవినీతికి పాల్పడ్డాడు. 2020 కొవిడ్ సమయం కావడంతో అతడికి కలిసి వచ్చింది. దీనిపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణను పారదర్శకంగా జరపాలని కలెక్టర్ కమిటీని, జీజీహెచ్ సూపరింటెండెంట్‌ని ఆదేశించారు. నరసింగరావు 20 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళికి మంగళవారం సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అతడిపై ఉన్న అవినీతి ఆరోపణలను, అతడు ఇచ్చిన సమాధానాలను విచారణ కమిటీ కలెక్టర్‌కు నివేదించనుంది.

గుర్రపాలెంలో రోడ్డు ప్రమాదం

- రెండు ద్విచక్రవాహనాల ఢీ
- నలుగురికి తీవ్ర గాయాలు
- ఒకరి మృతి 5

తక్కువ ధరకే బంగారమంటూ మోసం 5



కలెక్టర్ ప్రశాంతి

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు

11నుంచి నామినేషన్ల స్వీకరణ

సహాయ రిటర్నింగ్ అధికారిగా డీఆర్వో శ్రీరామచంద్రమూర్తి

రాజమహేంద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్ జారీ కావడంతో 4 తేదీ నుంచే జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, ఎన్నికల ప్రక్రియ ముగిసే డిసెంబర్ 12 వరకూ ఈ కోడ్ అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్, జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో టి.శ్రీరామచంద్రమూర్తితో కలిసి ఆమె మాట్లాడారు. పూర్వపు ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ జారీ చేసిందన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారని, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) టి.శ్రీరామచంద్రమూర్తి వ్యవహరిస్తారని చెప్పారు. మొత్తం గోదావరి జిల్లాల పరిధిలో ఎన్నికలు జరుగుతున్నాయని, అందులో భాగంగా జిల్లాలో 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు అక్కడే ఓటుహక్కు వినియోగించుకోవాలని చెప్పారు. మండలానికి ఒకటి వంతున జిల్లాలోని 18మండలాల్లో 10 కేంద్రాలు, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. జిల్లాలో మొత్తం 2893 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారన్నారు.

11నుంచి నామినేషన్ల స్వీకరణ

ఈ ఉప ఎన్నికకోసం ఈనెల 11న నోటిఫికేషన్ జారీ కానుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అదేరోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారని, 18వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారని, 19న నామినేషన్ల స్క్రూటినీ చేసి 21న అభ్యర్థుల విత్‌డ్రాకు చివరి తేదీ అన్నారు. డిసెంబర్ 5న పోలింగ్ జరుగుతుందని, 9న ఓట్లను లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు. 12వ తేదీకి మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నేటితో ముగుస్తున్న గడువు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదుకు 1,34,298 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఓటు నమోదు అధికారి, కాకినాడ జిల్లా డీఆర్వో వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారంతో ఓటు నమోదు గడువు ముగుస్తోందన్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లా 1785, కాకినాడ జిల్లా 25,964, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 28,227, తూర్పుగోదావరి జిల్లా 24,825, పశ్చిమ గోదావరి జిల్లా 31,757, ఏలూరు జిల్లాలో 21,740 దరఖాస్తులు వచ్చాయన్నారు. అర్హులైన పట్టభద్రులు బుధవారం కూడా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థులు ఓటు కోసం తహశీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

లేటరైట్ తవ్వేటప్పుడు క్యూబిక్ మీటర్లలో కొలుస్తారు. తవ్విన తర్వాత తరలింపు సమయంలో దాన్ని మెట్రిక్ టన్నులుగా పరిగణిస్తారు. ఇది రా మెటీరియల్‌గానే ఉండగా గ్రేడ్‌ను బట్టి ధర ఉంటుంది. లేటరైట్ ఒక మెట్రిక్ టన్ను ధర - రూ.950 నుంచి రూ.1100 ఉంటుంది.

వంతాడ సముద్ర మట్టానికి - 350 మీటర్ల ఎత్తులో ఉంది
ఇక్కడ లీజుకు తీసుకున్నది - 220 ఎకరాల అటవీ భూమి
ఇక్కడి గృహాల సంఖ్య- 110... జనాభా - 550మంది

2013 నుంచి 2033 వరకు వంతాడ రిజర్వ్‌ఫారెస్ట్‌లో లాటరైట్ తవ్వకాలకు ఆంధ్రా మైనింగ్ కంపెనీ లీజు పొందింది.

ఇప్పటివరకు తవ్వింది - మొత్తం 83.29లక్షల మెట్రిక్ టన్నులు
ఒడిశాకు తరలించినది - 32.75లక్షల మెట్రిక్ టన్నులు
చైనాకు తరలించినది - 4.65లక్షల మెట్రిక్ టన్నులు



ఈస్ట్ కేజీఎఫ్.. వంతాడ!



వంతాడలో లేటరైట్ తరలింపునకు క్యూకట్టిన లారీలు

కేజీఎఫ్ గుర్తుందా.. అక్కడ కోలార్ గోల్డ్ ఫీల్డ్స్.. బంగారం కోసం జరిగే అన్వేషణ.. రయ్యిమంటూ దూసుకెళ్లే టిప్పర్లు.. అదొక ప్రత్యేక ప్రపంచం.. అలాంటిదే ఇక్కడా మన ఈస్ట్‌లోను ఉందండి.. కానీ ఇక్కడ లేటరైట్ తవ్వుతుంటారు. సముద్ర మట్టానికి 350 మీటర్ల ఎత్తులో ఎక్కడో కొండపై ఉండే ఈ ప్రాంతానికి సాధారణ వాహనాల్లో వెళ్లలేం. సరైన రోడ్డు మార్గం కూడా లేదు. ఘాట్ రోడ్డు తరహాలో ఉండే ఒకే ఒక్క దారిలో నిత్యం లేటరైట్ లోడుతో లారీలు రయ్‌మంటూ దూసుకుపోతుంటాయి. ఈ లేటరైట్ తరలింపునకు ప్రత్యేకంగా ఓ రైల్వేస్టేషన్ కూడా ఉంది. ఆ ఉమ్మడి జిల్లా కేజీఎఫ్ ఎక్కడ ఉందో తెలుసుకోవాలనుందా అయితే ఈ కథనం చదివేయండి మరి..

ప్రత్తిపాడు,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప..ఊరు దిబ్బ అంటే ఇదేనేమో.. ఒక పక్క ప్రతి రోజూ కోట్లలో టర్నోవర్.. మరో పక్క కనీసం రోడ్డు మార్గం కూడా గిరిజన తండా అది.. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఈ.గోకవరం పంచాయతీ పరిధిలో వంతాడ గ్రామం ఉంది..

లేటరైట్ ఎగుమతికే ప్రత్యేక రైల్వేలైన్

వంతాడలో రెండు దశాబ్దాలుగా లేటరైట్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి ముడిసరుకును 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న తొండంగి మండలం రావికంపాడుకు టిప్పర్లలో తరలిస్తారు. అక్కడ ఈ లేటరైట్ తరలింపునకు ప్రత్యేకంగా రైల్వేస్టేషన్ నిర్మించారు. దగ్గర్లోని మెయిన్ రైల్వే లైన్ నుంచి ఇక్కడకు ప్రత్యేక లైన్ కూడా వేశారు. వంతాడ నుంచి ఇక్కడకు తెచ్చిన లేటరైట్‌ను రావికంపాడు రైల్వేస్టేషన్ నుంచి ఒడిస్సాకు గూడ్స్ రైళ్లలో ఎగుమతి చేస్తారు. అక్కడ అల్యూమినియం ఫ్యాక్టరీల్లో దీన్ని ప్రాసెసింగ్ చేసి స్టీల్ తయారీకి వినియోగిస్తారు. తెలంగాణ



రావికంపాడులో రైల్వేస్టేషన్ వద్ద లేటరైట్ గుట్టలు

- లేటరైట్ గనులకు ప్రసిద్ధి వంతాడ
- ఏడాది పొడవునా లేట..రైట్
- రవాణాకు ప్రత్యేక రైల్వేస్టేషన్
- రావికంపాడు టూ ఒడిస్సా
- సీఆర్ఎస్ నిధుల ఊసేలేదు
- కానరాని మౌలిక వసతులు
- యువతకు ఉపాధి లేదు..
- అయినా పట్టని నాయకగణం

ఇక్కడ 110 గృహాలు ఉండగా 550 మంది జనాభా నివసిస్తున్నారు.ఎందుకంటే ఇది ఒక గిరి జన తండా..ఇందులో విశేషమేముందని తీసిపారేయవద్దు అసలు విషయం తెలిస్తే ఆశ్చర్యపోక మానరు.. ఒకప్పుడు పచ్చటి అందాలకు నెలవు. కానీ ఇప్పుడు లేటరైట్ మైనింగ్‌కి పెట్టింది పేరు.. ప్రకృతి వనరులు పుష్కలంగా ఉండడంతో ఏడాది పొడవునా మైనింగ్ తవ్వకాలు జరుగుతుంటాయి. కానీ ఆ ఊరు మాత్రం అభివృద్ధికి ఎంతో దూరంగా ఉంది. అత్యవసరమైతే మరో దారిలో కొండ దిగి వెళ్లాల్సి ఉంటుంది. ఓ పక్క రూ.కోట్లలో టర్నోవర్ జరిగే లేటరైట్ తవ్వకాలు.. మరో పక్క కనీస అభివృద్ధికి నోచుకోని ఊరు.. ఇంత వ్యత్యాసం ఉన్న ఈ ప్రాంతం పేరు వంతాడ.. అయినా పాలకులకు పట్టడం లేదు.

కళ్లెదుటే బంగారం..గ్రామాభివృద్ధి శూన్యం



వంతాడ గిరిజన గ్రామం

లేటరైట్ అంటే..

లేటరైట్ అంటే ఉష్ణమండల ప్రాంతాల్లో భూమిలో లభించే అరుదైన ఖనిజం.దీన్ని నిర్మాణ, పారిశ్రామిక రంగాల్లో ఎక్కువగా వినియోగిస్తారు. ఇది అత్యంత విలువైన వనరు. దీని తవ్వకం వల్ల పర్యావరణపరంగా,స్థానికంగా ప్రతికూల ప్రభా వం చూపిస్తుంది. ఈ లేటరైట్ తవ్వగా వచ్చే ముడి సరుకు సిమెంట్, అల్యూమినియం ఫ్యా క్టరీల్లోసిమెంట్,స్టీల్ తయారీకి ఉపయోగిస్తున్నారు.

లేటరైట్ గనులకు ప్రసిద్ధి..

ఇ.గోకవరం పంచాయతీ పరిధిలో వంతాడతో పాటు గిరిజనాపురం, ఎరకంపాలెం, ఆరేళ్లధార, వే ములపాలెం హామ్లెట్లుగా ఉన్నాయి. వంతాడలో మాత్రమే లేటరైట్ గనులు పుష్కలంగా ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో 20 ఏళ్ల కిందటే గుర్తించారు.అప్పటి నుంచి ప్రభుత్వ అనుమతుల మేరకు పలు కంపెనీలు ఇక్కడ తవ్వకాలు చేప డుతున్నాయి.మొదట్లో మహేశ్వరి కంపెనీ లీజుకు తీసుకుని తవ్వకాలు చేపట్టింది. తర్వాత కొన్ని కం పెనీలు మారాయి. ప్రస్తుతం ఆంధ్రా మినరల్స్ అనే కంపెనీ లీజు నడుస్తోంది.ఈ కంపెనీ వం తాడ కొండ పరిధిలోని 220 ఎకరాల్లో మైనింగ్ తవ్వకాలకు లీజుకు తీసుకుంది.ప్రస్తుతం వంతాడ గనులపై లేటరైట్ గనుల తవ్వకాలు సాగుతున్నాయి. గతంలో 200 వరకు లారీలు కొండ పైనుంచి కిందకు వచ్చేవి. ఇప్పుడు 50 లారీల వరకు రవాణా చేస్తున్నట్టు సమాచారం.

చంద్రబాబు టు పవన్ సుపరిచితమే..

వంతాడ గ్రామాన్ని ఎందరో రాజకీయ ఉద్దండులు గతంలో సందర్శించారు. వంతాడ లేటరైట్ గనుల్లో అక్రమాలు, దోపిడీలకు వ్యతిరేకంగా గిరిజనులు, ప్రజా సంఘాలు పోరాటాలు నిర్వహించాయి. వంతాడ గ్రామాన్ని అప్పట్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడిగా చిరంజీవి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, సీపీఐ, సీపీఎం నేతలు నారాయణ, మాజీ ఎంపీ మిడియం బాబురావు, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ సందర్శించారు.గ్రామంలోని రావిచెట్టు రచ్చబండ వద్ద సమావేశాలు నిర్వహించి గిరిజనుల సమస్యల పరిష్కారానికి హామీలు ఇచ్చారు. అయినప్పటికీ వంతాడ వాసుల గోడు అరణ్యరోదనగానే మిగిలింది. ఈ గిరిజనగూడెం సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగానే ఉంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి వంతాడ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

తరగని నిధి ఉన్నా..సమస్యలే


ప్రత్తిపాడు, రాజవొమ్మంగి మండల గ్రామాల సరిహద్దులో ఉన్న వంతాడ రెండు దశాబ్దాలుగా లేటరైట్ మైనింగ్ గనుల తవ్వకాలకు కేంద్రంగా ఉంది. కోట్ల రూపాయలు సంపద చుట్టూ ఉన్నా ఆ గిరిజన గూడెం అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంది. ఇక్కడ గనుల తవ్వకాల మాటున జరిగిన అన్యాయాలపై గిరిజనులతో పాటు ప్రజాసంఘాలు, ఎన్నో పార్టీలు పోరాడాయి. దీంతో ఈ గూడెం పేరు అప్పట్లో మార్మోగింది. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి నేతల సందర్శనతో వంతాడ దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది.అయినా కనీస వసతుల్లేక ప్రజలు అల్లాడుతున్నారు.కొండపై 110 నివాస గృహాలున్నాయి.వీటిలో 550 మంది నివసిస్తున్నారు.వీరిలో ప్రస్తుతం 90 మంది నివాస గృహాలకు దరఖాస్తు చేసినా మంజూరు కాక గృహాలు నిర్మించుకోలేకపోయారు. జలజీవన్ మిషన్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి పథకానికి మోటారు ఏర్పాటు చేయకపోవడం వల్ల గిరిజనులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మైనింగ్ కంపెనీ అవసరాల నిమిత్తం ఈ గ్రామంలో ఇనుప స్థంభాలను ఏర్పాటు చేసి కరెంటును సరఫరా చేశారు. ఈ స్థంభాలకు విద్యుత్ సరఫరా జరిగి పశువులు, గొర్రెలు, మేకలు వంటి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో వాటి స్థానే సిమెంటు స్థంభాలను ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు. గ్రామంలో 1 నుంచి 6వ తరగతి వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ 33 మంది విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కానీ బెంచీలు, ప్రహరీ, మరుగుదొడ్లు, కాంపౌండ్ హాలు వంటివి సౌకర్యాలు లేవు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

అనారోగ్యం వస్తే కొండ దిగాల్సిందే..

- వంతాడ గ్రామం పెద్దిపాలెం పీహెచ్‌సీలో ఉంది.గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే వాళ్లు కొండ దిగి ఆ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిందే. పెద్దిపాలెం పీహెచ్‌సీ నుంచి నెలకోసారి వైద్యులు వచ్చి వైద్య శిబిరం నిర్వహిస్తుంటారు.
- **వంతాడ** గిరిజనులకు ఉపాధి అవకాశాల్లేవు.లేటరైట్ మైనింగ్‌లోనైనా ఉపాధి కల్పించాలన్న డిమాండ్ ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 30 నుంచి 40 మంది పనిచేసేవారు.గత వైసీపీలో వారిని పనులు నుంచి తొలగించారు.
- గ్రామంలో లేటరైట్ అవసరాల నిమిత్తం తవ్వేసిన కొండలు అలానే వదిలేశారు.దీంతో వర్షాలు పడినప్పుడు ఆ గోతుల్లో నీరు ఉండిపోయి ప్రమాదకరంగా మారుతోంది. నిబంధనల ప్రకారం తవ్వకాలు చేపట్టిన చోట ఏర్పడిన గోతులను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పూడ్చాలి. కానీ, మైనింగ్ కంపెనీలు అలా చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.
- కొండపోడు భూముల రెవెన్యూ పట్టాలకు గిరిజనులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. అది నెరవేర్చాలని వారు కోరుతున్నారు.

వంతాడకు దారేది..

వంతాడ గ్రామానికి రౌతుపాలెం వైపు నుంచి ప్రత్తిపాడు వెళ్లడానికి ఒకదారి ఉంది. వంతాడ నుంచి కొండ దిగి రౌతుపాలెం రావాలి. అక్కడి నుంచి లంపకలోవ మీదుగా ప్రత్తిపాడుకు 10 కిలోమీటర్లు పడుతుం ది. కొండ తిమ్మాపురం వైపు నుంచి ఏలేశ్వరం వెళ్లడానికి మరొక దారి ఉంది. కానీ వర్షాల కార ణంగా దెబ్బతిని అది మూతపడిపోయి ఉంది. కొండ తిమ్మాపురం రహదారి కాలిబాట మార్గంగా మిగిలిపోయింది.ఈ రహదారులు ఘాట్ రోడ్డులా ఉండి ప్రమాదకర మలుపులు తిరిగి ఉంటాయి. బొలేరో లాంటి వాహనాలు తప్ప సాధారణ వాహ నాల్లో వెళ్లలేం. ఈ రెండు రహదారులను పక్కా బీటీ రహదారులుగా అభివృద్ధి చేయాలని గిరిజనుల కోరుతున్నారు.



మైనింగ్‌లో పని కల్పించాలి



వంతాడ లేటరైట్ మైనింగ్‌లో యువతకు పనిబాట్లు కల్పించాలి. గ్రామంలో అనారోగ్యాలకు గురైన వారిని ఏలేశ్వరం, ప్రత్తిపాడుకు తరలించడం కష్టసాధ్యంగా మారింది. రౌతుపాలెం, కొండ తిమ్మాపురం రహదారి మార్గాలు అభివృద్ధి చేయాలి.

-కుడే రాజబాబు, యువకుడు, వంతాడ

సీనరేజి రావడం లేదు..



ఐదేళ్లుగా మైనింగ్‌కు సంబంధించిన సీనరేజి రావడంలేదు. ఆదాయం ఆగిపోయింది. గతంలో సీనరేజీ బానే వచ్చేది. అంతకుముందు ఏడాదికి రూ.2లక్షల వరకు వచ్చేది. మాకున్న సమాచారం మేరకు ఈ నెల నుంచి రావొచ్చని ఆశిస్తున్నాం.

-వనపర్తి రామలక్ష్మి, సర్పంచ్, వంతాడ

తవ్వకాలతో విధ్వంసం

తూర్పు కనుమలను విధ్వంసం చేస్తూ వంతాడలో లేటరైట్ తవ్వకాలపై పర్యావరణవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కొండల తవ్వకంవల్ల దుమ్ము, ధూళి రేగి పరిసరాల్లోని పచ్చదనం దెబ్బతింటోందని, లారీల్లో లేటరైట్ తరలింపుతో చుట్టపక్కల పంటలపై దుష్ప్రభావం చూపిస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ చేసిన ప్రాంతాలను నిబంధనల ప్రకారం నీటితో తడపాల్సి ఉన్నా అదీ చేయడంలేదని వాపోతున్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ కూడా స్థానికంగా ఖర్చుచేసిన దాఖలాలు లేవనివారు అభిప్రాయపడుతున్నారు.

ఉభయ గోదావరి జిల్లాల

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యాచరణ

- కాకినాడ కలెక్టరేట్‌లోనే నామినేషన్ల స్వీకరణ
- ఆరు జిల్లాల్లో 116 పోలింగ్ కేంద్రాలు... 16,316 మంది ఓటర్లు
- నామినేషన్ల దాఖలకు ఆరు జిల్లాల నుంచి కాకినాడ కలెక్టరేట్‌కు రావాల్సిందే
- కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే షెడ్యూల్ విడుదల కాగా 11న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను నియమించారు. కాకినాడ కలెక్టరేట్‌లోనే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. దీంతో కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆరు జిల్లాల నుంచి నామినేషన్ల దాఖలకు కాకినాడ కలెక్టరేట్‌కు రావాల్సి ఉంది. అసిస్టెంట్ ఎన్నికల రిట్నరింగ్ అధికారులుగా కాకినాడ డీఆర్వో జె.వెంకటరావు, తూర్పు గోదావరి జిల్లా డీఆర్వో సీతారామ్మూర్తి, కోనసీమ జిల్లా డీఆర్వో వి.మదన్‌మోహన్, పశ్చిమ గోదావరి జిల్లా డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఏలూరు డీఆర్వో వి.విశ్వేశ్వరరావులను నియమించారు. వీరు ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలు జిల్లాలవారీగా..

ఆరు జిల్లాల్లో 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 కేంద్రాలు, తూర్పు గోదావరి జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 20 కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 22 కేంద్రాలు, కోనసీమ జిల్లాలో 12 కేంద్రాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఓటర్లు జిల్లాల వారీగా..

మొత్తం 16,316 మంది ఓటర్లు ఉన్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614 మంది ఓటర్లు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 2893, ఏలూరు జిల్లాలో 2605, కాకినాడ జిల్లాలో 3333, కోనసీమ జిల్లాలో 3209, పశ్చిమ గోదావరి జిల్లాలో 3,662 ఓటర్లు ఉన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీకి సంబంధించి నియోజకవర్గాల పరిధిని ఎన్నికల సంఘం ఇలా నిర్ణయించింది. కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాల్లోని ఉంగుటూరు, భీమ డోలు, నిడమర్రు, గణపవరం, పెదవేగి, పెదపా డు, దెందులూరు, ద్వారకా తిరుమల, పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, కుక్కునూరు, వేలేరుపాడు, చింతలపూడి, లింగపాలెం, కామవరపుపేట, జంగారెడ్డిగూడెం మండలాలు, అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, ఏజెన్సీ గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, దేవీపట్నం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, చింతూరు, వరరామచంద్రపురం, ఎటపాక, కూనవరం మండలాలుగా నిర్ణయించింది.



అమెరికాలోని టెక్సాస్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న భార్యాభర్తలు సలాది కొండలరావు, సూరవరపు అనురాధ

ఎన్నికలు హోరాహోరీగా జరుగుతున్నాయి

పిఠాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్ష పదవికి ఈ సారి హోరాహోరీగా ఎన్నికలు .జరుగుతున్నాయి. కాకినాడ, పిఠాపురం పట్టణాలకు చెందిన మేము అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నాం. డోనాల్డ్ ట్రంప్ గెలిచే అవకాశాలు ఉన్నాయి. ఆయన గెలిస్తే మార్కెట్ బాగుంటుందని మా భావన. అయితే పోటీ తీవ్రంగానే ఉంది. ఎవ్వరికి గెలుపు అంత సులభం కాదు. భారతీయ సంతతికి చెందిన కమలాహారిస్‌కు కూడా ఓటర్లు మద్దతు అధికంగానే ఉంది. ఎవ్వరు గెలుస్తారన్నది ఉత్కంఠగానే ఉంది.





1996 సంవత్సరంలో తుఫాను చిత్రాలు(ఫైల్)

అదో కాళరాత్రి

నవంబరు 6 అంటేనే కోనసీమ వాసులకు హడల్..

28 ఏళ్ల క్రితం సృష్టించిన హరికేన్ పెను విధ్వంసం

(ఆంధ్రజ్యోతి-మండపేట)

పచ్చదనం, అసూయపరిచే అందం కోనసీమ సొంతం... అటువంటి సుందర సీమను పెను తుఫాను అతలాకుతలం చేసింది. 1996 నవంబరు 6 బుధవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన చినుకులు ఈదురుగాలులై పెను తుఫానుగా మారి పచ్చని సీమను అస్తవ్యస్తం చేసింది. జన నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం, పశు నష్టం...ఇలా అనేక విధాలుగా కోనసీమ కాటిసీమగా మారింది. ఇది జరిగి నేటికి 28 సంవత్సరాలు కావస్తోంది. ఆనాటి కాళరాత్రిని ప్రజలు నేటికీ మరచిపోలేరు. లక్షల్లో నేలవాలిన కొబ్బరిచెట్లు తలలు వాల్చాయి. వేలల్లో జనం మృత్యువాతపడ్డారు. గృహాలు పేకమేడల్లా కూలిపోయాయి. మత్స్యకార తీర ప్రాంతాలు, గ్రామాలకు జరిగిన నష్టం అపారం. అప్పట్లో సీఎంగా వున్న చంద్రబాబు యుద్ధ ప్రాతిపదికన స్పందించారు. హుటాహుటిన ప్రత్యేక హెలికాప్టర్ ఉమ్మడి రాజధాని హైదరాబాద్ నుంచి అమలాపురం చేరుకున్నారు. కోనసీమ అంతటా పర్యటిస్తూ అధికారులను, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేశారు. రాజమహేంద్రవరంలోనే ఉండి తాత్కాలిక సెక్రటేరియట్ ఏర్పాటు చేశారు. అంధకారంలో మునిగిన కోనసీమలో విద్యుత్ కాంతులు వచ్చే వరకు, ప్రజలకు సహాయ చర్యలు అందే వరకు అవిశ్రాంతంగా శ్రమించారు. ఆయన చతురతకు తోడు అధికారులు, నేతల సహకారం ప్రజలకు కొంతమేర ఊరట కలిగించారు. నష్టం పూడ్చలేకపోయినా దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందించిన సాయం మాత్రం మరవలేనిది.

వ్యతిరేక దిశలో వచ్చి..

1996 నవంబరు 6న తుఫాను సమయంలో 160 నుంచి 200 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచాయి. మచిలీపట్నం వద్ద తీరాన్ని దాటాల్సిన తుఫాను వ్యతిరేక దిశలో కాకినాడను తాకడంతో ఈ విపత్తు సంభవించింది. సముద్ర తీర గ్రామాలైన బలుసుతిప్ప, భైరవపాలెం, పల్లం, ఎస్.యానాం, మొల్లేటిమొగ తుడిచి పెట్టుకుపోయాయి.

1.41 లక్షలు ఎకరాల్లో వరి పంట, 70,847 ఎకరాల్లో కొబ్బరి తోటలు, 11,960 ఎకరాల్లో అరటి, 3,544 ఎకరాల్లో చెరకు, 14,727 ఎకరాల్లో ఉద్యానవన, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. 3.57 లక్ష గృహాలు పాడయ్యాయి. రూ.3,677.29 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అంచనా వేసింది. 34 గ్రామాలు తుఫాను ప్రభావానికి గురికాగా 426 గ్రామాలు దెబ్బ తిన్నాయి. పెనుగాలులకు 1.76 లక్షల హెక్టార్లలో వరి, 12వేల హెక్టార్లలో పత్తి, 8వేల హెక్టార్లలో చెరకు దెబ్బతిన్నాయి. 291 హెక్టార్లలో కొబ్బరి దెబ్బతింది. 245 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. విద్యుత్, కమ్యూనికేషన్, వ్యవస్థలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా పరిశ్రమలు, రైస్‌మిల్లులు, పేపరు మిల్లులు, అయిల్ మిల్లులు దెబ్బతిన్నాయి. కోళ్లఫారాలకు విపరీతమైన నష్టం కలిగింది. అప్పటి మంత్రి జీఎంసీ బాలయోగి, ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ప్రజలు తుఫాను నుంచి కోలుకునే వరకు అహరహం శ్రమించారు.


సామర్లకోట భీమేశ్వర ఆలయంలో ఆకాశ దీపపూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా కార్తీకమాస పూజలు

సామర్లకోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):కార్తీకమాస మహాపర్వదినాలు పురస్కరించుకుని కాకినాడజిల్లా సామర్లకోట కుమారరామభీమేశ్వరాలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణ మధ్య అభిషేకాలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామిఅమ్మవారిని దర్శించారు. మధ్యాహ్నం లక్షపత్రి పూజలలో కాకినాడకు చెందిన విశ్వవీరేశ్వరరావు దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. ఆలయ ధ్వజస్థంభంవద్ద ఆకాశదీప పూజలలోనూ, కార్తీక దీపారాధన సంఘ సభ్యులుచే నిర్వహించిన జ్యోతిర్లింగార్చన పూజలలోనూ భక్తులు పాల్గొన్నారు.


హంస వాహనంగా రూపుదిద్దుకొంటున్న పంటు

సత్యదేవుడి తెప్పోత్సవ పంటుకు మరమ్మతులు పూర్తి

అన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం పురస్కరించుకుని ఈనెల 13న జరగనున్న సత్యదేవుడి తెప్పోత్సవానికి వినియోగించే హంసవాహన పంటుకు మంగళవారం మరమ్మతులు పూర్తిచేసి పండితులు ప్రత్యేకపూజలతో పంపా రిజర్వాయర్ గట్టువద్దకు చేర్చారు. బుధవారం నుంచి హంసవాహనం తయారీ పనులు చేపడుతున్నట్లు ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తెలిపారు. ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలతో ఈనెల 10న హంసవాహనం ట్రయిల్‌రన్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

గుర్రప్పాలెంలో ఘోర రోడ్డు ప్రమాదం

● రెండు బైకులు ఢీ ● ఒకరు మృతి ● నలుగురికి తీవ్ర గాయాలు


బైకులు ఢీ కొన్న ప్రమాదంలో తీవ్రగాయాలతో పడి ఉన్న క్షతగాత్రులు


మృతిచెందిన గోళ్ళ డానియేల్ (ఫైల్)

జగ్గంపేట రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా జగ్గంపేట మండలంలోని గుర్రప్పాలెం గ్రామ శివారున మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా ఒకరు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే... గుర్రప్పాలెం గ్రామ శివారున ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. జగ్గంపేట గ్రామానికి చెందిన గోళ్ళ డానియేల్, మరో నలుగురు వ్యక్తులు జగ్గంపేట నుంచి భావారం వెళ్లారు. అక్కడ ఏలేరు ప్రాజెక్టు సందర్శించి తిరిగి వస్తుండగా జగ్గంపేట నుంచి గుర్రపాలెం వెళ్తున్న మొర్త అప్పన్న, మొర్తసతీష్, యాకోబు ప్రయాణిస్తున్న బైక్‌ను డానియేల్ బైక్ బలంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే గాయపడ్డ వారిని జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఒక్కరే వైద్యుడు అందుబాటులో ఉండటంతో క్షతగాత్రులు పరిస్థితి వర్ణనాతీతం. విషయం గమనించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించేందుకు అంబులెన్స్‌ల కోసం ప్రయత్నించినా అందుబాటులో లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కుటుంబం సభ్యులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఆసుపత్రి సిబ్బంది లేకపోవడంతో వాచ్‌మెన్ సెలైన్లు పెట్టడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఆసుపత్రిలో వైద్య సేవలు అందే అవకాశం లేకపోవడంతో కుటుంబ సభ్యులు కాకినాడ తరలించేందుకు ప్రయత్నించగా సాయంత్రం 6గంటలకు అంబులెన్స్ వచ్చింది. అంబులెన్స్‌లో కాకినాడ తరలించగా మార్గమధ్యలో గోళ్ళ డానియేల్ (24)మృతి చెందాడు. మొర్త సతీష్, మొర్త అబ్రహం యమగిరి, యాకోబు, సత్తరపు సతీష్‌లు జగ్గంపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్లు జగ్గంపేట ఎస్ఐ రఘునాధరావు తెలిపారు.




ఆసుపత్రిలో నర్సులు లేక క్షతగాత్రులకు సెలైన్ పెడుతున్న వాచ్‌మెన్, తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న దృశ్యం



ఉల్లి..ధర లొల్లి!

● కర్నూలుకు రేటు రాదు ... మహారాష్ట్రకు పోటీ లేదు ● కర్నూలు ఉల్లి అందుబాటులోకి వచ్చినా తగ్గని ధరలు

● కర్నూలు రకం కేజీ రూ.25 లోపే, మహారాష్ట్ర ఉల్లిపాయలు కేజీ రూ.70 పైనే

● మరి కొన్నాళ్లు ధరల భారం మోయాల్సిందే

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర ఉల్లిపాయల ధరలు మండుతూనే ఉన్నాయి. రోజులు, వారాలు కాదు ఏకంగా నెలల తరబడి రేటు నేలకు దిగిరావడంలేదు. కర్నూలు ఉల్లిపాయలు మార్కెట్లోకి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చినా మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్ ఏమాత్రం తగ్గడంలేదు. మరోపక్క షోలాపూర్ రకం కొత్త ఉల్లిపాయలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేయలేకపోతున్నాయి. రైతు బజార్లలో మహారాష్ట్ర ఉల్లిపాయలకు, కర్నూలు ఉల్లిపాయలకు మధ్య రేటు తేడా చూస్తే మహారాష్ట్ర ఎంత డామినేట్ చేస్తుందో అర్థమవుతుంది. రైతు బజార్లలో కర్నూలు రకం కేజీ రూ.26లు ఉంటే, మహారాష్ట్ర పాయలు కేజీ రూ.50ల ధర ఉంది. బహిరంగ మార్కెట్లో నాణ్యత కల్గిన మహారాష్ట్ర ఉల్లిపాయలు కేజీ రూ.60 నుంచి రూ.70 వరకూ విక్రయిస్తుండగా, కర్నూలు పాయలు మాత్రం రూ.25లు దాటకపోవడం గమనార్హం. షోలాపూర్ కొత్తపాయలు కూడా కేజీ రూ.30లోపే ఉన్నాయి. ఉభయగోదావరి, విశాఖపట్నం అర్బన్, కృష్ణా తదితర కొన్ని ప్రాంతాల ప్రజలు మహారాష్ట్ర రకం ఉల్లిపాయలను తప్ప ఇతర రకాలను వినియోగించరని, ఎంత రేటు ఉన్నా వాటినే కొంటారని, దీంతో మహారాష్ట్ర ఉల్లికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని హోల్‌సేల్ వ్యాపారులు, మార్కెటింగ్ అధికారులు విశ్లేషిస్తున్నారు.

● తాడేపల్లిగూడెం మార్కెట్‌కే కర్నూలు పాయలు ...

కర్నూలు రకం ఉల్లిపాయలకు తాడేపల్లిగూడెం హోల్‌సేల్ మార్కెట్ ప్రాచుర్యం పొందింది. ఇక్కడి నుంచే వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు కర్నూలు ఉల్లిని ఎగుమతి చేస్తారు. కర్నూలు ఏరియాలో ఎక్కువగా కాంట్రాక్టు ఫార్మింగ్ ఉంటుంది. దీంతో తాడేపల్లిగూడెంలోని కొంతమంది బడా హోల్‌సేల్ వ్యాపారులు కర్నూలు ప్రాంత రైతులకు ముందుగా అడ్వాన్సులు ఇచ్చి పంట చేతికొచ్చినప్పుడు సరుకును తీసుకొంటుంటారు. సాగుకు ముందే రైతులకు పెట్టుబడి పెట్టడంతో సరుకు డైరెక్టుగా తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వస్తోంది. వీటిని ఇక్కడి హోల్‌సేల్ ట్రేడర్లు జార్ఖండ్, ఒడిశా, బీహార్ వంటి ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. మన రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం ప్రాంతాల్లోని సామాన్య, దిగువ మధ్యతరగతి వర్గాలు ఈ రకం పాయలను ఎక్కువగా వినియోగిస్తారని, మహారాష్ట్రతో పోల్చితే ధర కాస్త తక్కువ కావడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. కర్నూలు పాయలకు దిగువతరగతి వర్గాలే టార్గెట్‌గా వ్యాపారం సాగుతుంది. అలాగే జిల్లాలో సంతలు, స్థానికంగా నిర్వహించే చిల్లర మార్కెట్లకు తాడేపల్లిగూడెం మార్కెట్ నుంచి వ్యానుల్లో తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

● తొందరగా డ్యామేజీ ... నిలవకు ఆగవు ...

కర్నూలు ఉల్లి తొందరగా డ్యామేజీ అవుతుంది. నిలవకు ఆగదు. మహారాష్ట్ర ఉల్లిపాయలు నెలల తరబడి గొడౌన్లలో నిల్వచేసినా పాడవకుండా ఉంటాయి. కానీ కర్నూలు ఉల్లికి ఆ పరిస్థితి లేదు. దీంతో వచ్చిన సరుకు వచ్చినట్టే ఆ రోజున్న రేటుకు హోల్‌సేల్ ట్రేడర్లు అమ్మేస్తుంటారు. అందువల్లే మహారాష్ట్ర పాయలను కొన్నంత ధైర్యంగా కర్నూలు పాయలను హోల్‌సేల్ ట్రేడర్లు కొనుగోలు చేయరని, వ్యాపారులకు వ్యాపారం తప్ప పబ్లిక్ ఇంట్రస్టు ఎక్కువగా ఉండదని చెబుతారు. నిజానికి కర్నూలు ఉల్లిపాయ చాలా బాగుంటుంది. ఘాటు ఎక్కువ, రుచి కూడా ఉంటుంది. గ్రేవీ కూడా ఎక్కువ వస్తుంది. కాకపోతే, ఉల్లిపాయ కాస్త ఎరుపు రంగులో ఉండడం, కూర వండిన తర్వాత కూడా కొంచెం ఎరుపుగా కనిపించడంతో చాలా మంది వీటిని ఇష్టపడరు. అలాగే, కర్నూలు పాయ చిన్నగా ఉంటుంది. మనకు ఆనదు. మహారాష్ట్ర నాసిక్ ప్రాంతంలోని ఉల్లిపాయ పెద్దగా ఉండి కంటికి ఆనుతుంది. ఈ విషయం హోల్‌సేలర్లకు తెలుసు కాబట్టి ట్రేడర్లు దీనిపైనే ఎక్కువ దృష్టి పెడతారు.

● నాసిక్ ఉల్లి కోసం మరికొన్నాళ్లు ఆగాల్సిందే ..

దీపావళి పండుగ తర్వాత మహారాష్ట్ర కొత్త ఉల్లిపాయలు మార్కెట్లోకి వస్తాయని అంతా భావించారు. హోల్‌సేల్ ట్రేడర్లు కూడా ఇదే చెబుతూ వచ్చారు. ఆమేరకు ఒక్క షోలాపూర్ ప్రాంతం నుం చి మాత్రమే కొత్త ఉల్లిపాయలు మార్కెట్లకు వస్తున్నాయి. మార్కెట్లో మంచి డిమాండ్ కల్గి, ఎక్కువ రోజులు నిల్వ ఉండే సరుకుగా పేరున్న నాసిక్ పరిసర ప్రాంతాల నుంచి ఉల్లి ఎప్పుడు వస్తుందనేది హోల్‌సేల్ ట్రేడర్లు సైతం చెప్పలేకపోతున్నారు. షోలాపూర్ రకం కొత్తపాయలు కావడంతో కొనేందుకు వినియోగదారులు ఆసక్తి చూపడంలేదు. ఎందుకంటే నాలుగైదు రోజుల కంటే ఎక్కువ నిల్వ ఉండవు. కర్నూలు ఉల్లితో పోల్చితే కాస్త బెటర్ అనిపించినా షోలాపూర్ ఉల్లి ఆరుదల పాయ కాకపోవడంతో కొనుగోళ్లు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. ఇక కర్నూలు ఉల్లిపాయలు మార్కెట్‌ను ముంచెత్తినా ధరలను ప్రభావితం చేసే పరిస్థితి లేకపోవడంతో ప్రజలకు ధరాభారం తప్పడంలేదు. అనంతపురం పంట వస్తుందని చెబుతున్నా కచ్చితమైన సమాచారం లేదు. షోలాపూర్ రకం మాదిరిగా అనంతపురం ఉల్లిపాయలు మీడియంగా ఉంటాయని, అవి మార్కెట్లకు వస్తే ధరలు కాస్త అదుపులోకి రావచ్చని భావిస్తున్నారు. గతంలో కర్ణాటకలోని కోలార్ జిల్లాలో ఉల్లిసాగు చేసేవారు. అక్కడి రైతులు ఇతర పంటల వైపు మొగ్గు చూపడంతో అక్కడి నుంచి ఉల్లిపాయలు మార్కెట్లోకి రావడంలేదు. ఇవన్నీ సామాన్య, దిగువ మధ్యతరగతి ప్రజల ఉల్లి కష్టాలకు కారణంగా మారుతున్నాయి.

కలెక్టర్ రెగ్యులర్‌గా సమీక్షిస్తున్నారు ...

● సునీల్ వినయ్, జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి

ఉల్లిపాయలతో పాటు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలను తగ్గించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. జేసీ నేతృత్వంలో ధరల నియంత్రణ కమిటీ ఎప్పటి కప్పుడు మార్కెట్‌ను గమనిస్తూ సమీక్ష చేస్తోంది. ఇప్పటికే రైతు బజార్ల ద్వారా ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతు బజార్లలో ధరలు అదుపులో ఉంటేనే బహిరంగ మార్కెట్లో ధరలను నియంత్రించగలం. రేటు తక్కువగా ఉన్న కర్నూలు, షోలాపూర్ పాయలను కూరల్లో ఎక్కువగా వినియోగించాలి. తొందరలోనే మహారాష్ట్ర నాసిక్ రకం ఉల్లిపాయల ధరలు కూడా అదుపులోకి వస్తాయి అని ఆయన పేర్కొన్నారు.

సెంట్రల్ జైలు జూనియర్ అసిస్టెంట్ అదృశ్యం

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. బాపట్ల జిల్లా నాగారం గ్రామానికి చెందిన మన్నెం విజయ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో జూనియర్ అసిస్టెంట్, టైపిస్టుగా పనిచేస్తోంది. విజయ కొవ్వూరులోని మెరకవీధి వాటర్‌ట్యాంకువద్ద షేక్ బాషా ఇంటిలో అద్దెకు ఉంటోంది. అక్టోబరు 14వ తేదీ నుంచి విధులకు హాజరుకావడం లేదని జైలు అధికారులు నవంబరు 1వ తేదీన ఇంటికి సమాచారం అందించారు. దీంతో విజయ సోదరి పాగోలు ఉదయభాస్కరమ్మ కొవ్వూరు వచ్చి ఇంటి యజమానిని చెల్లెలు గురించి ఆరా తీశారు. అక్టోబరు 11న ఊరు వెళ్తున్నాని చెప్పి ఇంటికి తాళంవేసి వెళ్లిందని, తిరిగి రాలేదన్నారు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించకపోవడంతో ఉదయ భాస్కరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

భోజనం దగ్గర వివాదం

● ఒకరి హత్య

మోతుగూడెం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): భోజనం విషయంలో ఇద్దరి మధ్య జరిగిన వివాదం ఒకరి హత్యకు దారి తీసింది. ఈ ఘటన మంగంపాడు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మరిగెల అబ్బాయిరెడ్డి(41) దెబో చికెన్ షాపులో పనిచేస్తాడు. ఈనెల మూడున అక్కడ భోజనానికి అన్నం లేకపోవడంతో గ్రామంలో ఉన్న సోదరి సైని లక్ష్మీ ఇంటికి వెళ్లాడు. ఆ ఇంట్లో అన్నం లేకపోవడంతో పక్కనే ఉంటున్న ఆమె కుమారుడు వెంకటరెడ్డి ఇంట్లోకి వెళ్లాడు. ఆ సమ యానికి వెంకటరెడ్డి, ఆయన భార్య ఇంట్లో లేరు. అన్నం ఉండడంతో అబ్బాయిరెడ్డి తింటున్నాడు. ఇంతలో వచ్చిన వెంకటరెడ్డి ఆగ్రహంతో పీట తీసుకుని అతడి తలపై బలంగా కొట్టాడు. అబ్బాయిరెడ్డిని చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అబ్బాయిరెడ్డి మంగళవారం మరణించాడు. కేసును చింతూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చింతూరు ఆసుపత్రిలో పసిబిడ్డ మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న తల్లిదండ్రులు

● ఐటీడీఏ ముందు బైటాయింపు


పసి బిడ్డ మృతికి వైద్యుల నిర్లక్ష్యమేనంటూ ఐటీడీఏ ముందు బైటాయించిన తల్లిదండ్రులు

చింతూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చదలవాడకు చెందిన కలుముల దుర్గారావు, బుల్లెమ్మల ఐదునెలల పసిబిడ్డ మంగళవారం అల్లూరి జిల్లా చింతూరు ఏరియా ఆసుపత్రిలో మృతి చెందింది. దుర్గారావు దంపతుల బిడ్డ అస్వస్థతకు గురవడంతో సోమవారం చింతూరు ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. మంగళవారం ఆ పసిబిడ్డ మృతి చెందింది. దీంతో ఆగ్రహానికి గురైన దుర్గారావు దంపతులు మృతి చెందిన తమ బిడ్డతో సహా ఐటీడీఏ కార్యాలయం ముందు బైటాయించారు. దుర్గారావు వెల్లడించిన వివరాలు.. తమ బిడ్డ అస్వస్థతకు గురవడంతో సోమవారం చింతూరు ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చామన్నారు. స్థానికంగా మెరుగైన చికిత్స అందించలేని పక్షంలో తమ బిడ్డను భద్రాచలం తరలించాల్సిందిగా వైద్యులను కోరామన్నారు. అవసరం లేదని ఇక్కడనే చికిత్స అందిస్తామని వైద్యులు చెప్పారని అన్నారు. చివరకు తమ బిడ్డ మృతి చెందిందన్నారు. సకాలంలో భద్రాచలం తరలించి నట్లైతే బిడ్డ బతికేదని దుర్గారావు వాపోయాడు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ బాధితులతో మాట్లాడారు. పూర్తి వివరాలు సేకరించి నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకుంటానని తల్లిదండ్రులకు నచ్చ చెప్పారు.


మృతి చెందిన 5 నెలల పసిబిడ్డ

దీంతో బాధితులు దీక్ష విరమించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఐటీడీఏ వాహనంలో చదలవాడకు పీవో ఆదేశాల మేరకు సిబ్బంది తరలించారు.

తక్షణం సర్వే మొదలు పెట్టండి

● వైద్యశాఖకు ఐటీడీఏ పీవో ఆదేశాలు

పసిబిడ్డ మృతితో చింతూరు ఐటీడీఏ పీవో స్పందించారు. ఈ మేరకు డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పుల్లయ్యకు పీవో పలు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో బాగంగా చింతూరు డివిజన్‌లో బుధవారం నుంచి ఇంటింటా సర్వే చేపట్టాల్సిందిగా ఆదేశించారు. చలి కాలం వచ్చినందున ఏడాదిలోపు బిడ్డల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీయాలన్నారు. ఏ ఒక్కరి ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోయినా వారిని తక్షణమే ఆసుపత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించాలన్నారు. మరణాలు సంభవించకూడదన్నారు. ప్రతి సచివాలయంలో తన (ఐటీడీఏ పీవో)మొబైలు నెం. డిస్‌ప్లే చేయాలన్నారు. ఆరోగ్య స్థితిగతుల విషయంలో ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే తనకు ఫోన్ చేయాల్సిందిగా పీవో ప్రజలను కోరారు.

● మృతిపై విచారణ

చింతూరు ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ఐదు నెలల పసిబిడ్డ మృతి చెందింది. ఈ మేరకు స్పందించిన పీవో ప్రకటన విడుదల చేశారు. మృతికి కారణాలను ఆరా తీస్తున్నామన్నారు. వైద్యుల నిర్లక్ష్యం ఉన్నట్లు స్పష్టమైతే చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యాన్ నుంచి భారీగా మంటలు

● వ్యాన్ దగ్ధం ● డ్రైవర్ సహా నలుగురు క్షేమం


ఆలమూరులో మెయిన్‌రోడ్డులో దగ్ధమవుతున్న బొలెరో వ్యాన్

ఆలమూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మెయిన్‌రోడ్డులో ప్రయాణిస్తున్న వ్యాన్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ఓఎన్జీసీకి చెందిన బొలెరా వ్యాన్ జొన్నాడ నుంచి పెదపళ్ల వద్ద ఉన్న జీసీఎస్ వద్ద వెళుతుండగా ఆలమూరు బ్యాంక్ సెంటర్ దాటగానే ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో వ్యాన్‌లో డ్రైవర్‌తో సహా నలుగురు ప్రయాణిస్తున్నారు. మంటలను గమనించిన వారు వ్యాన్ నుంచి దిగిపోవడంతో రోడ్డుపై వ్యాన్ పూర్తిగా దగ్ధమైంది. ఆ ప్రాంతం నుంచి కొంత ముందుగా వ్యాన్ నుంచి ఆయిల్ లీక్ అయినట్లుగా స్థానికులు చెబుతున్నారు. వ్యాన్ దగ్ధమవుతున్న సమయంలో మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను అదుపుచేసి ప్రమాదం వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. మండపేట అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని వ్యాన్ మంటలు అదుపు చేసిన తరువాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గిరిజన ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్

రంపచోడవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలోని స్వయం సహాయక సంఘాలు, గిరిజన ఉత్పత్తులకు ఆన్‌లైన్ గ్లోబల్ మార్కెటింగ్ సదుపాయం కల్పించే విధంగా ఓపెన్ నెట్వర్క్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేసినట్లు వెలుగు ఐటీ మేనేజర్ లంకే రామరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గిరి జన ప్రాంతంలో గిరిజనులు, డ్వాక్రా మహిళలు వివిధరకాల వస్తువులు, వెదురుఉత్పత్తులు, అల్లికలు, మిల్లెట్స్, చీపురు, పచ్చళ్లు తదితర వస్తువులు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ తరహాలో మై స్టోర్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో అమ్ముకొనే విధంగా సదుపాయం కల్పిస్తున్నామన్నారు. వస్తువుల వివరాలతో పాటు ఆధార్, పాన్, బ్యాంక్ ఎకౌంట్ వివరాలతో సమీపంలోని వెలుగు మండల సమాఖ్య కార్యాలయం, రంపచోడవరం, టీపీఎం యూ హెడ్ క్వార్టర్ కార్యాలయంలో ఉచితంగా ఈకామర్స్ వెబ్‌సైట్‌లో పొందుపర్చడం, గిరిజన, డ్వాక్రా ఉత్పత్తులకు ఆదాయం సమకూరుతుందన్నారు.

ఆరుకు చేరిన మృతుల సంఖ్య

● సూర్యారావుపాలెంలో బాణసంచా ఘటనలో మరో ముగ్గురు మహిళలు మృతి

పెంటపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గత నెల 30వ తేదీన ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడిన దుర్ఘటనలో మృతుల సంఖ్య 6కు చేరింది. సంఘటనా స్థలంలోనే వేగరౌతు శ్రీవల్లి, గుమ్మడి సునీత మృత్యువాత పడగా రెండురోజుల తరువాత ఇరగవరం మండలం కావలిపురం గ్రామానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరావు మృతి చెందాడు. సోమవారం రావిపాడు గ్రామానికి చెందిన శీలం లక్ష్మి(45), మందలంక కమలరత్నం (47), దువ్వ గ్రామానికి చెందిన కడిమి కుమారి(53) ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శీలం లక్ష్మికి భర్త దుర్గారావు, కుమార్తె ఉండగా కమలరత్నంకు భర్త వెంకట్రావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. దువ్వ గ్రామానికి చెందిన కడిమి కుమారికి భర్త లేడు. ఒక కుమారుడు మాత్రమే ఉన్నాడు.

తక్కువ ధరకే బంగారమంటూ మోసం

» షిర్డీ మ్యూజియంలో పనిచేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు.. కేసు నమోదు

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తక్కు వ ధరకు బంగారం ఇస్తానని చెప్పి డబ్బు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ఏలూ రు జిల్లా పోలవరం మండలం పాత పట్టిసీమకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి నారపురెడ్డి కనకయ్య మధురపూడి ఎయిర్‌పోర్టులో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. 2023 జూలై 6న కుటుంబ సభ్యులతో షిర్డీ వెళ్లాడు. అక్కడి మ్యూ జియంలో పనిచేస్తున్న అల్లాడి కునాల్ కశ్యప్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి కనకయ్య భార్య వరలక్ష్మిని కశ్యప్ అక్కా అని పిలిచేవాడు. 2024 ఫిబ్రవరి 6న పట్టిసీమ ఇంటికి వచ్చి వధువు ఫొటోలు చూపించి పెళ్లి కుదిరిందని చెప్పి 2 వారాలు ఇంట్లో ఉన్నాడు. విదేశాల్లో కొంత బంగారం తక్కువ ధరకు లభించిందని, దానికి సంబంధించి సెక్యూరిటీ డిపాజిట్లు చెల్లించాలని, బంగారానికి రూ.4,80,000 దఫదఫాలుగా ఫోన్‌పే ద్వారా ఎస్‌బీఐ అకౌంట్‌కి, బైక్‌కి సంబంధించి కొవ్వూరు బజాజ్ షోరూంలో రూ.86,000 చెల్లించారు. ఎంతకి బంగారం గాని, బైక్ గాని, ఇవ్వకపోవడంతో తీసుకున్న డబ్బు ఇవ్వాలని ఎన్నిసార్లు ఫోన్‌చేసినా సమాధానం చెప్పడం లేదన్నారు. విశాఖపట్నం ఆదిఆసుపత్రిలో ఉన్నాడని తెలిసి అక్కడికి వెళ్లి కనకయ్య విశాఖపట్నం ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్‌లో ఫి ర్యాదు చేశారు. దీనిపై పోలీసులు జీరో ఎఫ్ఐ ఆర్ నమోదు చేసి కేసును కొవ్వూరు రిఫర్ చేశా రు. దీనిపై కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు మరలా కేసునమోదు చేసినట్టు తెలిపారు.

సరిహద్దు దాటిన పులి

● అక్కడి నుంచి ఇక్కడకు - ఇక్కడి నుంచి అక్కడకు ● కారిడార్ విస్తరణ పనిలో నిరంతర కూంబింగ్‌లతో అంతరాయం? ● ఛత్తీస్‌గడ్‌లో రెండు ఆవులపై దాడి


బండ అటవీ ప్రాంతంలో పులి పాదముద్ర

చింతూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షంగా పరోక్షంగా కన్పించిన పులి ఇరవై రోజులపాటు గిరిజనులను వణికించింది. అంతేకాదు నాలుగు ఆవులను కాపు కాచి చం పింది. ఇప్పుడు చింతూరు అటవీ డివిజన్ దాటి సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గడ్‌లో అడుగు పెట్టింది. అంతేకాదు సోమ వారం అక్కడ రెండు ఆవులను వేటాడింది. ఇప్పుడు ఆ రాష్ట్రంలో అలజడి మొదలైంది. అక్కడ కూడా పులి ప్రధాన రహదారిని ఆనుకుని సంచరించడం గమనార్హం. ఆ క్రమంలోనే కొందరి కంట పడింది. విషయం అటవీ అధికారులకు చేరింది. దీంతో అక్కడి అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. సుక్మా డీఎఫ్‌వో అశోక్‌పటేల్ ఆదేశా లతో సిబ్బంది పులి పగ్‌మార్క్స్ (పాదముద్రలు) సేకరించారు. ఎనిమిది నుంచి తొమ్మిది అంగుళాల వరకు ఉన్నట్లు నిర్ధారణకొచ్చారు. కూనవరం అటవీ పరిధిలో సంచరించిన పులి పాదముద్రలు కూడా అవే కొలతలు కలిగి


పులి దాడిలో మృతి చెందిన ఆవు

ఉన్న విష యం విధితమే. దీంతో మన ప్రాంతం నుంచి అక్కడకు చేరినట్లు అక్కడి అటవీ అధికారులు అంచనాకొచ్చారు. కూన వరం అటవీ పరిధిలో 40 ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేసినప్పటికీ పులి కదలికలు కెమెరాలో చిక్కని విషయం కూడా తెల్సిందే. దాదాపు పదిహేనేళ్ల క్రితం కూనవరం, వరరామ చంద్రపు రం మండలాల అటవీ ప్రాంతంలో పులి సంచరించింది. ఇన్నేళ్లకు మళ్లీ ప్రత్యక్షమైంది. చింతూరు డివిజన్‌తో పోల్చితే సుక్మా డివిజన్ లో అటవీ ప్రాంతం దట్టంగా ఉంటుంది. దీంతో పులుల సంచారం అక్కడ కొత్తేమీకాదు. అయితే ఇటీవల కాలంలో దండకారణ్యంలో మానవ సంచారం అధికమైంది. మావోయిస్టుల అణచివేత లక్ష్యంగా అంతర్యుద్ధం సాగుతోంది. ఇందులో భాగంగా దండకారణ్యంలో ప్రతి ఐదు కిలోమీటర్ల దూరంలో పోలీసు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. అదే దశలో అటవీ గ్రా మాలకు రహదారులు, వంతెనల పనులు ము మ్మరంగా చేస్తున్నారు. అనంతరం దండకార ణ్యంలో మునుపెన్నడూ లేని విధంగా మానవ సంచారం పెరిగింది. ఇది వణ్య ప్రాణుల స్వేచ్ఛకు అంత రాయం కలిగిస్తోందన్న వాదన ఉంది. దీంతో పులితో పాటు ఇతర అటవీ జంతువులు సుర క్షిత ప్రాంత అన్వేషణలో పడి ఉంటాయన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి. పులి విస్తారంగా సంచరించడం కూడా ఇందులో భాగ మేనంటున్నారు. వణ్యప్రాణి ప్రేమికుల అధ్య యనం మేరకు ఒక పులి తన సామ్రాజ్యాన్ని (కారిడార్) అటవీ ప్రాంతంలో 60నుంచి 100 కిలోమీటర్ల మేర వైశాల్యాన్ని ఎంపిక చేసుకుం టుంది. ఈ మేరకే పులి తాజాగా ఇరు రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతంలో తన కారిడార్ ఎంపిక కోసం సంచరిస్తుందన్న ప్రచారం సాగుతోంది.

దివిలిలో 'పొలం పిలుస్తోంది'

పెద్దాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివిలి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో కొమ్మోజు సంజయ్‌కుమార్ రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తిం వెంకటశ్రీనివాసరావు తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో నాగులచవితి

● నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు ● నైవేద్యాలు సమర్పించిన భక్తులు ● బాణసంచా కాల్చి సంతోషంగా గడిపిన చిన్నారులు





పెద్దాపురంలో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు, గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు, తాళ్లరేవులో పుట్ట వద్ద పూజలు

పోర్టుసిటీ(కాకినాడ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నాగులచవితిని ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం కాకినాడ సినిమా రోడ్‌లోని నాగేంద్రస్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. జన్నాథపురం అన్నమ్మఘాటీ సెంటర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం, జిల్లా పరిషత్ సెంటర్‌లోని పీఆర్ కళాశాల ప్రహరీ వెంబడిగల పుట్టల్లో భక్తులు పాలు పోశారు. కుటుంబసమేతంగా కలిసి వచ్చి స్వామికి ప్రీతి పాత్రమైన గుడ్లు, చలివిడి, నువ్వులతో తయారు చేసిన చిమిలి, పప్పు, బెల్లం, అరటి పండ్లతో పూజలు చేశారు. పుట్టలను పసుపు, కుంకుమ, పువ్వుల్లో అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దాపురం: పట్టణ, మండలంలో తెల్లవారు జామునే పుట్టల వద్దకు ప్రజలు చేరుకుని పాముల పుట్టలకు పూజలు చేశారు. పుట్టలను ప్రత్యేకంగా అలంకరించి చలివిడి, చిమ్మిలి, పాలు, గుడ్లు, తేగలు, బుర్రగుంజులు, వడపప్పు మొదలయినవి నైవేద్యంగా సమర్పించి తమ భక్తి ప్రవర్తులను చాటుకున్నారు. బాణాసంచా కాల్చుతూ ఆనందంగా గడిపారు. మండల పరిధిలోని కట్టమూరు గ్రామంలో ప్రదర్శించిన బళ్ల వేషాలు, డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. గుర్రాలాట, దేవతామూర్తుల వేషధారణలను ప్రదర్శించారు.

కొత్తపల్లి: మండల గ్రామాల్లో ప్రజలు నువ్వులతో తయారు చేసిన చిమ్మిలి, తాటిటెంకల గుంజు, కోడి గుడ్లు, ఆవు పాలు పుట్టల్లో పోసి నాగేంద్రస్వామికి పూజలు చేశారు. అనంతం టపాసులు కాల్చారు. చేలల్లో కుటుంబసభ్యులందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్: పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు మండలాల పరిధిలోని గ్రామాల్లో నాగులచవితిని ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయమే స్నానాలు ఆచరించి పంటపొలాల్లోని పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి పూజలు జరిపారు. అక్కడే బాణసంచా కాల్చారు. తాటిపర్తి అపర్ణాదేవి ఆలయం వద్ద నాగులచవితి సందర్భంగా పూజలు జరిగాయి.

సామర్లకోట: సామర్లకోట మండలం, పట్టణంలో భక్తులు నాగులచవితి పూజలను నిర్వహించారు. ఇంటిల్లపాదీ పవిత్రస్నానాలు ఆచరించి నాగేంద్రస్వామిని పూజించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి చిమ్మిలి, చలిమిడి, బుర్రగుంజు, ఆవుపాలు, కోడిగుడ్లు తయ వెంట తీసుకువెళ్లి ఆయా సమీపప్రాంతాలలో ఉన్న పొలాలలో పాముపుట్టల వద్దకు చేరుకుని నైవేద్యాలు సమర్పించారు. పుట్టల వద్ద చిన్నారులతో కలిసి బాణసంచా కాల్చారు. మరికొందరు సమీపంలోని ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

తాళ్లరేవు: మండల గ్రామాల్లో పుట్టల్లో ప్రజలు పాలుపోసి పూజలు చేశారు. టీడీపీ నేతలు వేగేశ్న భాస్కరరాజు, వుంగరాల వెంకటేశ్వర్లు పుట్టకు పూజలు చేశారు. తాళ్లరేవు, పోలేకుర్రు, సుంకరపాలెం, చొల్లంగి, కోరింగ, పటవల, జి.వేమవరంలో నాగులచవితిని నిర్వహించుకున్నారు.

కరప: మండలవ్యాప్తంగా నాగుల చవితి పర్వదినాన్ని భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పొలాల్లో తిరిగే రైతులకు ఎటువంటి హాని తలపెట్టకుండా సర్వదా రక్షించాలని కోరుతూ నాగేంద్రుడికి పూజాధికాలు నిర్వహించారు. సమీపంలోని తోటలు, పొలాల్లోకి వెళ్లి నాగుల పుట్టలో పాలు, గుడ్లు, పలు పిండిపదార్థాలను ఉంచి పూజలు చేశారు. బాణసంచా కాల్చి పిల్లలతో సరదాగా గడిపారు. కరప పీహెచ్‌సీ ఆవరణలోని భారీ నాగుల పుట్ట వద్దకు భక్తులు తరలివచ్చి పూజలు చేపట్టారు.

పిఠాపురంలో అగ్నిప్రమాదం

పశువుల పాక, గడ్డిమేట్లు దగ్ధం



పిఠాపురంలో చెలరేగుతున్న మంటలు

పిఠాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారం అనఘా దత్తక్షేత్రం సమీపంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. చల్లా శివకుమార్‌కు చెందిన తాటాకుల పాక, గడ్డిమేట్లు దగ్ధమయ్యాయి. తారాజువ్వ పడడంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో పాకలో పశువులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో మంటలు వ్యాపించకుండా అదుపు చేయగలిగారు. సుమారు లక్ష రూపాయిలకు పైగా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 36 మందికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 36మందికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు మంగళవారం తీర్పు చెప్పారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించే దిశగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాను సారం, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్‌విష్ణు సారథ్యంలో ట్రాఫిక్ సీఐలు ఎస్.రమేష్, డి.రామారావు బృందం సోమవారం రాత్రి కాకినాడలోని పలు కూడళ్లలో ప్రత్యేక డ్రంకన్ డ్రైవ్ నిర్వహించింది. ఈ డ్రైవ్‌లో మొత్తం 36మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. మంగళవారం వారిని కోర్టులో హాజరుపర్చగా వారిలో 15మందికి ఒక్కొక్కరికీ రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 21మందికి ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు సీఐ రమేష్ తెలిపారు.

మోకాళ్ల మార్పిడిలో రోబోటిక్ విధానం

కాకినాడ క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన మోకాళ్ల మార్పిడిలో అధునాతమైన రోబోటిక్ శస్త్రచికిత్సా విధానం కాకినాడకు కూడా అందుబాటులోకి వచ్చింది. కాకినాడ దేవాలయం వీధిలోని సిద్ధార్థ హస్పటల్ ఆర్థో వైద్యనిపుణుడు డాక్టర్ ముత్తా ఆదిత్యకృష్ణ మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మిస్సో రోబోటిక్ సిస్టంకు చెందిన పూర్తి ఆటోమేటిక్ టెక్నాలజీతో అత్యాధునిక పద్ధతిలో మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సా విధానం తమ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చిందన్నారు. రోబోటిక్ విధానంలో నిర్వహించే శస్త్రచికిత్సల వల్ల కచ్చితత్వం, తక్కువ సమయం, నొప్పి లేకుండా శస్త్రచికిత్సకు అవకాశం ఉంటుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిత్యకృష్ణ

టీడీఆర్ కుంభకోణంపై విచారణ చేపట్టాలి

మంత్రి నారాయణకు టీడీపీ నాయకుల వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో కాకినాడ నగరంలో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలని కాకినాడ నగర టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్ మంగళవారం మున్సిపల్‌శాఖా మంత్రి పొంగూరు నారాయణను కోరారు. జిల్లా పర్యటన సందర్భంగా టీడీపీ కార్యాలయానికి విచ్చేసిన మంత్రి నారాయణను టీడీపీ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీరు, రమేష్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి టీడీఆర్ బాండ్ల రూపంలో కాకినాడ కార్పొరేషన్ నిధులు రూ.500 కోట్లు దోచుకున్నాడన్నారు. దుమ్ములపేట ప్రాంతంలో ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు ఈ భూమిపై రూ.251కోట్లు టీడీఆర్ బాండ్లు మంజూరు చేయించి నగర ప్రజలు సొమ్ముల రూపంలో చెల్లించిన కష్టార్జితాన్ని ద్వారంపూడి స్వాహా చేశాడన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గదుల సాయిబాబు, వొమ్మి బాలాజీ, దండుప్రోలు నాగబాబు, పంతాడి రాజు, మల్లాడి గంగాధరం, ఎండీ అన్సర్ పాల్గొన్నారు.

మంత్రికి మోహనవర్మ సత్కారం

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తొలిసారి కాకినాడ నగరానికి విచ్చేసిన రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణను టీడీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు వనమాడి మోహనవర్మ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

సమస్యల పరిష్కారానికి 104 ఉద్యోగుల నిరసనలు



కరప మండల వైద్యాధికారికి వినతిపత్రమందిస్తున్న 104 ఉద్యోగులు



గొల్లప్రోలులో వైద్యాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

కరప, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోరుతూ 104 ఉద్యోగులు మంగళవారం కరప ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట నిరసన చేపట్టారు. పలు వినతులతో కూడిన పత్రాన్ని మండల వైద్యాధికారి శ్రీనివాస నాయక్‌కు అందజేశారు. 104 ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.త్రిమూర్తులు, ఇందుమతి మాట్లాడుతూ గత 16ఏళ్లుగా ప్రజలకు విశేష సేవలందిస్తున్నా తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రెండు వారాల్లో తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గొల్లప్రోలు: వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలులో 104 ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఉద్యోగులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అరబిందో యజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. గొల్లప్రోలు, చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారులకు వినతి అందజేశారు.

పెద్దాపురం: తమ న్యాయపరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు. సుమారు 16ఏళ్ల నుంచి పని చేస్తున్నామని, గత వైసీపీ ప్రభుత్వం తమను అరబిందో ఫార్మా కంపెనీకి అప్పగించి ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కంటే కూడ తాము తక్కువ వేతనాలకు పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేకపోతే ఆందోళనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా కాండ్రకోట పీహెచ్‌సీ వైద్యాధికారిణికి వినతి పత్రాన్ని డీఈవో రాధాకృష్ణ, 104 పైలట్ వెంకట్రావు అందజేశారు.

విధుల పట్ల నిర్లక్ష్యం ఎంతమాత్రం తగదు : కమిషనర్

సామర్లకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయాల్లో సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం ఎంతమాత్రం తగదని, సమయపాలన పాటించి అవుడ్‌డోర్ వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిష్టర్‌లో నమోదులు చేయాలని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ఆదేశించారు. మంగళవారం సామర్లకోటలోని అయోధ్యరామపురం 13వ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ వెళ్లిన సమయంలో కేవలం ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. మిగిలిన సిబ్బంది అందరూ అవుట్‌డోర్ వర్క్‌కు వెళ్లారని చెప్పడంతో ఆమె స్వయంగా వారికి ఫోన్ చేసి తక్షణం తన ఎదుట హాజరు కావాలని ఆదేశించడంతో ఒక్కొక్కరూ సచివాలయానికి వచ్చారు. అయితే సచివాలయంలో సిబ్బంది రాకపోకలకు చెంది ఎటువంటి మూమెంట్ రిజిష్టర్ నిర్వహించడం లేనట్లు కమిషనర్ గుర్తించారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల ఎప్పటికప్పుడు అమలు చేయడంలో కూడా సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆమె గుర్తించారు. వీఆర్వో సచివాలయంలో అందుబాటులో లేని కారణంగా, హాజరు పట్టికలో నిర్దేశించిన రీతిలో సంతకాలు చేయడం లేనట్లు గుర్తించి సదరు వీఆర్వోకు మెమో జారీ చేయాలని ఆమె ఆదేశించారు. పన్నుల వసూళ్ల ప్రగతి తీరు నిరా శాజనకంగా ఉందన్నారు. పన్నుల బకాయి లు ఉన్న ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేయడమే గాక తరచూ వారికి ఫోన్లు చేసి పన్నులు సత్వరం వసూలయ్యేలా కృషిచేయాల న్నారు. సిబ్బంది పనితీరు మరింత మెరుగు పర్చుకోకపోతే మరోసారి తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.



సిబ్బందిని ప్రశ్నిస్తున్న కమిషనర్ శ్రీవిద్య

రహదారులు ఇలా... ధాన్యం తరలింపు ఎలా?



సామర్లకోటలో కెనాల్ రోడ్డు దుస్థితి

సామర్లకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల రహదారులు పెద్దపెద్ద గోతులతో ప్రమాదభరితంగా మారడంతో నిత్యం ప్రమాదాలకు నిలయాలుగా అవుతున్నాయి. ఈ తరుణంలో ఖరీఫ్ వరిపంటకు చెంది రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతుంది. అయితే గ్రామీణరహదారుల పరిస్థితి దయనీయంగా ఉన్నందున రైతుల పొలాలు, కళ్ళాల నుంచి సమీప రైస్‌మిల్లులకు రవాణా చేయాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఏమంత ఆమోదయోగ్యంగాలేవని వాపోతున్నారు. పెద్ద లారీలు మినహా ఈ గోతులలో ఎవరీ ట్రాక్టరూ అద్దెకి ఇచ్చే పరిస్థితిలో లేకపోవడంతో రైతులు ఇప్పటి నుంచే ఆందోళన చెందుతున్నారు. మరో పక్క పల్లె పండుగల పేరిట ఇదే సమయంలో గత వారంరోజులుగా గ్రామీణ రహదారుల నిర్మాణాలకు కొబ్బరికాయలు కొట్టే పనులను జోరందించారు. ఇప్పటికిప్పుడు నిర్మాణాలు చేపడితే గ్రామాల నుంచి మిల్లులకు ధాన్యం రవాణా అయ్యే మార్గాలు మూసుకుపోయే ప్రమాదం ఉంది. మరో 10, 15 రోజుల్లో ఖరీఫ్ వరి సాగు దిగుబడులు చేతికందే అవకాశాలు ఉన్నందున ఇప్పటి నుంచే ప్రజాప్రతినిధులు, సివిల్ సప్లయ్ అధికారులు, రెవెన్యూ అధికారులు సమీక్షించి ప్రత్యామ్నాయ సదుపాయాలను అన్వేషించాల్సిందిగా మండల గ్రామాల రైతులు కోరుతున్నారు.

కొత్త ఓటర్లుగా చేర్పించాలి : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతిఏటా చేపట్టే ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి అయిన మల్లిబాబు మంగళవారం కాకినాడలోని ఆర్డీవో కార్యాలయంలో పర్యవేక్షణ అధికారులు, బూత్ స్థాయి అధికారులతో ఓటర్ల నమోదు, ఇంటింటా ఓటర్ల సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ ఓటర్ల సర్వే, నమోదు కార్యక్రమం డిసెంబర్ నెలతో ముగిస్తున్న నేపథ్యంలో కొత్తగా ఓటర్ల నమోదు ఫారం-6 ద్వారా 2025, జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా చేర్పించాలన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలకు సంబంధించి మృతుల ఓట్ల తొలగింపులో ధ్రువీకరణ పత్రం ద్వారా తొలగించాలన్నారు. కాకినాడ రూరల్ డిప్యూటీ తహసీల్దార్ ఆర్.కళ్యాణ్, పర్యవేక్షణాధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా చేరాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు

పిఠాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి త్వరలో జరిగే ఎన్నికలకు గానూ ఓటర్లుగా చేరగోరే వారు బుధవారం సాయంత్రంలోగా తమ దరఖాస్తులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో అందజేయాలని పిఠాపురం తహశీల్దారు వీవీ.గోపాలకృష్ణ సూచించారు. పిఠాపురం తహశీల్దారు కార్యాలయంలో మంగళవారం రాజకీయపార్టీల ప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలు తదితరులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులు సమీపంలోని తహశీల్దారు లేదా మున్సిపల్ కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయవచ్చునని చెప్పారు. సమావేశంలో రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వెంకన్న, రఘు, అల్లుబోయిన సూరిబాబు, సాయిరాం, రాంభీబాబు, కోనేటి రాజు, కె.రాజబాబు, టి.శ్రీనివాస్, పీవీరెడ్డి, ఆనందకుమార్, ఎలక్షన్ డీటీ కృష్ణ పాల్గొన్నారు.

మాకు పరిహారం అందలేదు

చేబ్రోలులో పట్టురైతుల ధర్నా



చేబ్రోలులో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నాసికరం పట్టుగూళ్లతో తాము నష్టపోయినప్పటికీ తమకు పరిహారం అందలేదని పేర్కొంటూ గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన 15మంది పట్టురైతులు మంగళవారం పట్టుపరిశ్రమల కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. అక్టోబరు 11వ తేదిన 30మంది పట్టురైతులు కలిసి రామ్‌నగర్ నుంచి గుడ్లు తెచ్చారు. పిల్ల దశలోనే ఇవి గూడు కట్టవని నిర్ధారించి 15మంది రైతులు పంటను తొలగించగా, మిగిలిన వారు పంట కొనసాగించారు. ఈ నేపథ్యంలో ఈ 15మంది రైతులను నష్టపరిహారం అందించే జాబితాలో చేర్చలేదు. మొత్తం 86 మంది రైతులకు పరిహారం అందగా, తమకు మాత్రం అన్యాయం జరిగిందని ఊటా సుబ్బారావు, ఓరుగంటి దుర్గారామారావు, ఉలవల బాలసత్యనారాయణ, రాయి సీతబాబు, వీరబాబు, ఓరుగంటి రాజు తదితరులు తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లదామని ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో వారు ధర్నాకు దిగారు. జిల్లా కలెక్టరు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

మంత్రిని ట్రోలింగ్ చేయడం మానుకోవాలి

రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షుడు యనమదల రవి

కాకినాడ సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒక తండ్రి కొడుకును మందలించినట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను మందలించారు తప్ప అందులో వేరే ఉద్దేశ్యం లేదని, దీన్ని చిలవలు పలవలు చేస్తూ బీసీ మంత్రి సుభాష్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసేలా ట్రోలింగ్ చేయడం మానుకోవాలని ఉమ్మడి రాష్ట్ర వైద్యఆరోగ్య మౌలిక సదుపాయల సంస్థ మాజీ చైర్మన్, రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షుడు యనమదల రవి కోరారు. కాకినాడలోని సంఘ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో కూడా సుభాష్‌కు పార్టీలకతీతంగా అభిమానులు ఉన్నారన్నారు. ఎమ్మెల్యే, మంత్రి కాక ముందు ప్రజలకు ఉపయోగపడే ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారన్నారు.

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ కనబరచాలి

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై ప్రతిఒక్కరూ శ్రద్ధ కనబరచాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ సూచించారు. పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన 1, 13, 14 సర్కిళ్లలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. చెత్త సేకరణ ఏవిధంగా చేపడుతున్నదీ ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా తీయాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మాణిక్యాలరావు, వరప్రసాద్, నాయుడు పాల్గొన్నారు.



కాకినాడలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ సుధాకర్

సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ పోటీలకు పిఠాపురం విద్యార్థి



చిక్కాల అవినాష్

పిఠాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు పిఠాపురానికి చెందిన విద్యార్థి చిక్కాల అవినాష్ ఎంపికయ్యాడు. పట్టణంలోని సూర్యరాయ డిగ్రీ కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న అవినాష్ గతంలో ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. బెంగుళూరులో ఈనెలలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో నన్నయ్య యూనివర్సిటీ జట్టు సభ్యుడిగా పాల్గొననున్నాడు. పోటీలకు ఎంపికైన అవినాష్‌ను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు, పిఠాపురం అసోసియేషన్ అధ్యక్షుడు మొగలి కాశీవిశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యు లు కొత్తెం సుందరకుమార్, ఖండేపల్లి నూకరాజు, కోడిగుడ్డు లోవరాజు,ఎస్.అర్జున్ తదితరులు అభినందించారు.

గొంచాలలో రీసర్వే సభ



రైతులకు వివరిస్తున్న తహశీల్దార్

సామర్లకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూ సంబంధిత సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం నిర్దేశించిన రీసర్వే గ్రామ సభలు భూయజమానులకు ఎంతగానో దోహదపడతాయని సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గొంచాల పంచాయతీ ఆవరణలో మంగళవారం డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీసర్వే గ్రామ సభకు తహశీల్దార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ సమస్యలకు చెంది 35 అర్జీలను వీఆర్వోలు రైతుల నుంచి సేకరించారు. సర్వేయర్ పీ.సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు టి.సాయిరామ్, ఏ.సంజీవ్, డి.దినేష్, సృజన, రాజామణి, మోషేరాజు, టి.సుబ్బారావు, ఎం.పద్మనాభం, సత్యవేణి, రైతులు పాల్గొన్నారు.

10న రక్తదాన శిబిరం

కొత్తపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధికి గురైన చిన్నారుల సహాయార్థం ఈనెల 10 కాకినాడలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు మూలపేట సెజ్ పునరావాసకాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, కాకినాడ చేయూత బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ అడపా వెంకటశ్రీనివాసరావు తెలిపారు. తలసేమియా వ్యాధి సోకిన చిన్నారులకు ప్రతీ 21రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి వస్తుందని, అటువంటి పరిస్థితుల్లో ఉన్న చిన్నారుల జీవితాలను నిలపడం కోసం చేయూత సంస్థ ఎప్పటి మాదిరిగానే ముందుకు వచ్చిందన్నారు. కాకినాడలో చేయూత భవన్‌లో నిర్వహించే రక్తదాన శిబిరంలో ఉపాధ్యాయులు, యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని చిన్నారుల ప్రాణాలను కాపాడాలని కోరారు.

కొనసాగిన వలంటీర్ల దీక్ష

తాళ్లరేవు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పనిచేసిన వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని చేస్తున్న నిరసనదీక్ష రెండో రోజు మంగళవారం కొనసాగింది. తాళ్లరేవు తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్షకు పలువురు సంఘాల నేతలు మద్దతు పలికారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

'వివక్షత చూపిస్తున్నారు'

కొత్తపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరిస్థితి బాగోగ చందా ఇవ్వనందుకు తమపై కులపెద్దలు వివక్షత చూపిస్తున్నారని వాపోతున్నారు ఓ వృద్ధ దంపతులు. మండలంలోని మూలపేట గ్రామంలో ఏటా కార్తీక మాసం ప్రారంభంలో గౌరీదేవిని ప్రతిష్ఠించడం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న సంప్రదాయం. గ్రామంలో చేనేత జాందానీ చీరల వ్యాపారం చేసే రాజాపంతుల బాబూరావు సంబరాలకు విరాళాన్ని అందజేసేవాడు. గత రెండు, మూడేళ్లుగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా విరాళం ఇవ్వలేకపోతున్నాడు. ఈ కారణంగా గత మూడేళ్లుగా ఎనిమిది పదులు దాటిన తమను స్థానిక కులపెద్దలు విస్మరించారని బాబూరావు, భార్య సీతారత్నం తీవ్ర మనస్తాపం వ్యక్తం చేశారు. కేవలం చందా ఇవ్వలేదని కులపెద్దలు వివక్షత చూపడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న బాబూరావు, సీతారత్నం

'మహిళా సంఘాల అభివృద్ధే ధ్యేయం'

కిర్లంపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా వెలుగు అధికారి డీపీఎం రాయ్ తెలిపారు. కిర్లంపూడిలో మంగళవారం మహిళా మార్టు సందర్శించి ధరల పట్టికను పరిశీలించారు. సేల్స్ మరింత పెంచాలన్నారు. ఏపీఎం వేదకుమారి, మార్టు ఇన్‌చార్జి సీసీ బుల్లియ్య, మార్టు సిబ్బంది ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి




ఎటపాక: గన్నవరంలో పుట్టలో పాలుపోస్తున్న భక్తులు, మోతుగూడెంలో భక్తుల సందడి

ఎటపాక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తిక మాసంలో వచ్చే నాగుల చవితిని మంగళవారం మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చవితి సందర్భంగా మహిళలు ఉపవాసలతో సమీప పుట్టలవద్ద పూజలు నిర్వహించి, పుట్టల్లో గోక్షీరంతో పాటు నవ్వులు, బెల్లం కలిపిన చిమ్మిలి,గుడ్లు, తేగలు వంటివి పోస్తారు. పుట్టలు అందుబాటులో లేని మహిళలు ఇంట్లో నాగదేవత చిత్రపటాలకు పూజలు నిర్వహించారు.

వీఆర్‌పురం: మండలంలో నాగులచవితిని ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తెల్లవారుజామునుంచే అధిక సంఖ్యలో పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నాణమాచరించి పుట్టలో పాలు పోసేందుకు కావలసిన ప్రసాదాలను తయారు చేసి, నాగేంద్రుడికి ఇష్టమైన గుడ్డు, పాలు అటవీ ప్రాంతంలో ఉన్న పుట్టల దగ్గరకు చేరుకుని పాలు, గుడ్లు, ప్రసాదాలను పోసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ కుటుంబ సమేతంగా పుట్టలో పాలుపోసి పూజించారు.

మోతుగూడెం,: చింతూరు మండలం మోతుగూడెం గ్రామస్థులు మంగళవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే పుట్టల్లో పాలు వేయడాకి భక్తులు తండోపతండాలుగా పుట్టల వద్దకు చేరుకుని నాగేంద్రస్వామికి పసుపుకుంకుమలతో పూజలు చేసి నైవేధ్యాలు సమర్పించారు.

దేవీపట్నం: మండలంలో ఇందుకూరు, ఇందుకూరుపేట, ఫజుల్లాబాద్, రావిలంక, పాముగండి, దబ్బకొండ, శరభవరం తదితర గ్రామాల్లో నాగులచవితి ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆయా గ్రామ సమీపంలో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఫజుల్లాబాద్‌లోని శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

వై.రామవరం: మండలంలో పలు గ్రామాల్లో చవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ శివారున పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. పుట్టలో పాలు, గుడ్డు వంటి నైవేధ్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంలోని నాగమ్మతల్లి గుడి వద్ద అభిషేకాలు, అర్చనలు చేయించుకుని భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

'ఉల్లాస్‌తో అక్షరాస్యతను పెంచాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యత శాతం తగ్గించి అక్షరాస్యులను పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రతీఒక్కరికీ విద్యను అందించాలని ఎంపీడీవో బాపన్నదొర సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు సీసీలు, వలంటరీ టీచర్లు, వీవోఏలకు దీనిపై శిక్షణా తరగతులు నిర్వహించారు. మండలంలో చదువుకోలేని వారిని గుర్తించి ప్రతీ రోజూ రెండు గంటల పాటు వారికి విద్య నేర్పించాలని అలాగే డిజిటల్ విద్యను అందించాలని, బ్యాంకు లావాదేవీలు తదితర వాటిపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో తెలిపారు. శిక్షణలో ఈవోపీఆర్డీ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బత్తుల భీష్మారావు వర్ధంతి



బత్తుల భీష్మారావు స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

చింతూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బత్తుల భీష్మారావు 39వ వర్ధంతిని సీపీఎం నాయకులు మంగళవారం చింతూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లపు వెంకట్, భద్రాచలం సీపీఎం నాయకుడు బండారు శరత్‌లతో కూడిన సీపీఎం బృందం భీష్మారావుకు నివాళులు అర్పించారు. అనంతరం పల్లపు వెంకట్, శరత్‌లు మాట్లాడారు. 1985 నవంబరు 5న నాటి పీపుల్సువార్ సీపీఎం నాయకుడు బత్తుల భీష్మారావుని హత్య చేశారన్నారు. భీష్మారావు లాంటి ప్రజానాయకుడుని హత్యచేసి ఈ ప్రాంతంలో సీపీఎం లేకుండా చేయాలన్న కుట్రను పీపుల్సువార్ పన్నింద న్నారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిదాయకంగా తీసుకున్న పేద ప్రజానీకం సీపీఎంను మరింత బలోపేతం చేసుకుందన్నారు. కార్యక్రమంలో బత్తుల ప్రశాంతి, ముర్రం రంగమ్మ, పెద్దరాములు, లక్ష్మణ్, దిలీప్, రమేష్, నాగార్జున, నాగేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ను సందర్శించిన తహసీల్దార్

మోతుగూడెం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం బూత్ నెం.7ను తహసీల్దార్ వి.వేణుగోపాల్ సందర్శించారు. ఆయన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పోలింగ్ బూత్ కోసం ఉపయోగించుకోబోతున్న తరుణంలో గ్రామ పంచాయతీ కార్యాలయం సందర్శించి చుట్టుపక్క వాతావరణ మౌలిక సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ ఓటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ కార్యకలాపాలు జరుగకుండా భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలన్నారు. ఓటు నమోదు చేసుకోవడానికి నవంబరు 6వ చివరి తేదీ కావడంతో అభ్యర్థులు ఉంటే ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఓటర్లకు తెలియజేశారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ వేమ సంధ్యారాణి, ఉప సర్పంచ్ జయదాస్ వీఆర్వో డి.సందీప్ చార్యులు, సీనియర్ అసిస్టెంట్ జి.శ్రీనివాస్, ఎంపీటీసీ రమణ, సెక్రటరీ మురళి ఉన్నారు.

'స్వార్థ ప్రయోజనాలకు పార్టీని వాడుకుంటున్నారు'



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

ఎటపాక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎటపాక వైసీపీలో కొందరు నాయకులు స్వార్థ ప్రయోజనాలకు పార్టీని ముక్కలు, చెక్కలు చేస్తూ అధికార పార్టీ నాయకుల అండదండలతో ముందుకు సాగుతున్నారని గుండాల ఎంపీటీసీ వైసీపీ నాయకులు జి.వెంకటరామిరెడ్డి అన్నారు. గుండాల గ్రామంలో మంగళ వారం వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశంను నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, ఆకుల వెంకట రామారావు మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్ని కల్లో వైసీపీ అభ్యర్థిని ధనలక్ష్మి ఓటమి పాలైనప్పటికీ ఎమ్మెల్సీ అనంతబాబు, నియోజకవర్గ ఇంచార్జ్ ధనలక్ష్మి నాయకత్వంలో వైసీపీ క్యాడర్ ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ముందు కెళ్తున్నామని అన్నారు. కొందరు సొంత పార్టీలో కుయుక్తులు పన్నుతున్నారని, వారి ఆటలు సాగవని హెచ్చరించారు. నేడు కూనవరంలో జరిగే పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఎమ్మెల్సీ అనంతబాబు, నియోజకవర్గ ఇంచార్జ్ ధనలక్ష్మి పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కురినాల బుజ్జి, దామర్ల రేవతి, బూరం అంజలి,గుండాల సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు

జగ్గంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి వేడుకలను మంగళవారం జగ్గంపేటలో భక్తి శ్రద్ధలతో ప్రజలు నిర్వహించుకున్నారు. తెల్లవారుజాము నుంచే కుటుంబ సభ్యులతో వెళ్లి పుట్టల వద్ద పూజలు నిర్వహించారు. పాలు, కోడి గుడ్లు, చిమిలి, చలివిడి, వడపప్పు ప్రసాదాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడే సహపంక్తి భోజనాలు నిర్వహించారు.

కోటనందూరు: మండల గ్రామాల్లో తెల్లవారుజాము నుంచే రైతులు తమ సమీప పొలాల్లోకి వెళ్లి పుట్టల వద్ద నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు చేశారు. కోటనందూరు, కెఎమల్లవరం, బొద్దవరం, అల్లిపూడి, జగన్నాధపురం, ఎస్‌ఆర్ పేట, కెఇచిన్నయ్యపాలెం, పాతకొట్టాం గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. గౌరీపార్వతికి పూజలు అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

తుని రూరల్: నాగుల చవితి సందర్భంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు ఆచరించారు. తుని సాయినగర్ సమీపంలో గల నాగేంద్రుని ఆలయం వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ప్రత్యేక అభిషేకాలు చేశారు.

రౌతులపూడి: మండల గ్రామాల్లో కుటుంబ సభ్యులతో కలిసి పొలాల్లో పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రుడికి పూజలు చేశారు. మూలగపూడిలో కోరుప్రోలు కుటుంబానికి చెందిన సూమారు 60 మంది ఒక్కచోటే పూజలు చేశారు. రౌతులపూడిలో అయ్యప్ప స్వాములు పెడతూళ్లు ఆడారు.




కోటనందూరు: జగన్నాధపురంలో పుట్ట వద్ద పూజలు, తొండంగిలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

తొండంగి: మండలంలో పొలాల్లో ఉన్న పుట్టల వద్దకు ప్రజలు చేరుకుని ముగ్గులు, పుష్పాలతో అలంకరించారు. చలిమిడి, చిమ్మిలి, కోడి గుడ్లు, పాలు పుట్టలో వేసి నాగేంద్రుడికి నమస్కరించారు. పుట్టపై వస్త్రాలు సమర్పించారు. బాణ సంచాకాల్చి ప్రసాదాలు పంచారు. ఆలయాల్లో నాగేంద్రుని ప్రతిమలకు అభిషేకాలు చేశారు.

ప్రత్తిపాడు: మండలంలోని ప్రజలు కుటుంబ సమేతంగా పొలాల్లోని పుట్టల వద్దకు తరలివెళ్లి చిమిడి, తాటిగుంజు, చలివిడి నైవేద్యాలతో నాగేంద్రుడికి పూజించారు. వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు కిటకిటలాడాయి.

బూరుగుపూడి శివాలయంలో ప్రత్యక్షమైన నాగుపాము



బూరుగుపూడి శివాలయంలో నాగుపాము దృశ్యాలు

కిర్లంపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి గ్రామంలోని శివాలయంలో నాగుపాము ప్రత్యక్షమైంది. మంగళవారం నాగులచవితి కావడంతో భక్తులు ఆలయాల్లో పూజలు చేస్తున్నారు. ఆ సమయంలో ఓ నాగుపాము అక్కడికి రావడంతో నాగేంద్రుడిగా కొలిచి ఆ పాముకు పాలు పోసి దర్శించుకున్నారు. ఆ పాము సుమారు అరగంట సేపు అక్కడే ఉంది. తర్వాత ఆ పాము ఆలయం పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లిపోయింది.

డొక్కా సీతమ్మ క్యాంటీన్

జగ్గంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రతి మంగళవారం జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం ఈ క్యాంటీన్‌లో పెద్దాపురం జనసేన నాయకుడు పసుపులేటి పణింద్రబాబు ఆర్థిక సహాయంతో 400 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సూరంపాలెం బాలు, మరిసే రామకృష్ణ, ఉలిసి ఐరాజు, సూరపు రెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, కంచేకోటి, గంగాధర,మొగలి గంగాధర్, రాజనాల శ్రీను, స్వామి, పీఎస్‌వీకే, ఓంకార్ తదితరులు ఉన్నారు.

క్యాన్సర్ కణితి తొలగింపు

తుని రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుని రూరల్ వెలంపేటకు చెందిన 56 ఏళ్ల పేద మహిళ కొద్ది కాలంగా రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతుంది. తుని ఏరియా ఆసుపత్రికి వైద్య నిమిత్తం రాగా డాక్టర్లు పరీక్ష నిర్వహించారు. అయితే రొమ్ము క్యాన్సర్‌గా నిర్ధారణ కావడం, మహిళకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆసుపత్రిలోనే డాక్టర్ సాయికిరణ్ బృందం ఆపరేషన్‌కు ఏర్పాటు చేశారు. ప్రమాదకరంగా ఉన్న కణితిని తొలగించి ఆమె ప్రాణాలను కాపాడారు. దీంతో వైద్యులు సాయికిరణ్, దినేష్, దుర్గాభవాని, శ్రీను, జ్యోతిలను ఆసుపత్రి సూపరింటిండెంట్ అభినందించారు.

ఎమ్మెల్సీ కోడ్ నిబంధనలు పాటించాలి

తహశీల్దార్ సూర్యప్రభ

ప్రత్తిపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కోడ్ నిబంధనలు పాటించాలని ప్రత్తిపాడు తహశీల్దార్ ఎం.సూర్యప్రభ కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకుల సమావేశం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ విడుదలైన నేపథ్యంలో నియమ నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ముగుస్తున్న నేపథ్యంలో బుధవారం ఓటర్ల నమోదును ఉధృతంగా నిర్వహించాలని కోరారు. నియోజకవర్గ టీడీపీ పొలిటికల్ మేనేజర్ కొండపల్లి శ్రీనివాస్, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీల తరుపున సింగిలిదేవ్ సత్తిరాజు, శేరుకృష్ణ, దర్నాల కోట శ్రీనులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిట్టిబాబు

ప్రత్తిపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజాల చిట్టిబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. చిట్టిబాబును స్థానిక కోర్టు సీనియర్ న్యాయవాదులు చలంకూరి రామకృష్ణ, బుగతా శివ, ఆడారి సుగుణ అభినందించారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



ప్రత్తిపాడు: పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యశశ్వికి అందజేస్తున్న 104 సిబ్బంది

వైద్యాధికారులకు వినతిపత్రాలు

ప్రత్తిపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళశారం మండల 104 సిబ్బంది వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. 104 సిబ్బందికి వేతనాలు మంజూరు చేయాలని, 104 సేవలను ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లకు జీవో 7ద్వారా వేతనాలు చెల్లించాలని వారు కోరారు. మండలంలోని పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యశశ్వి, రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి గీతలకు వినతిపత్రం అందజేశారు.

ఏలేశ్వరం: తమ న్యాయమైన డిమండ్లను పరిష్కరించాలంటూ 104 సిబ్బంది జె.అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.శ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కంప్యూటర్ ఆపరేటర్ పి.స్వర్ణ తేజ మాట్లాడుతూ తమకు గత 3 నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. ఉద్యోగులకు భద్రత కల్పిస్తూ ఇన్సూరెన్సు కల్పించాలని, యాజమాన్యం నుంచి రావలిసిన బకాయిలను చెల్లించేవిధంగా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పి.గోవిందరావు తదితరులున్నారు.

రౌతులపూడి: మూడు నెలలుగా జీతాలు లేక అల్లాడుతున్నా మని జీతాలు ఇప్పించాలని 104 సిబ్బంది మూలగపూడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌందర్యకు వినతిపత్రం అందజేశారు. కుటుంబ పోషణ భారంగా ఉందన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లకు, డీఈవోకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరవిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని వినతిపత్రంలో కోరారు.



రౌతులపూడి మండలం మూలగపూడి వైద్యాధికారికి వినతి అందజేస్తున్న 104 సిబ్బంది

విద్యుత్ చార్జీలను తగ్గించాలని కాంగ్రెస్ ర్యాలీ



జగ్గంపేటలో ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగ్గంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ జగ్గంపేటలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివగణేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ట్రావెల్స్ బంగ్లా వద్ద నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రెసిడెంట్ మాదేటి సత్యానందరావు, ఏపీ సీసీ జనరల్ సెక్రటరీ మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెంచిన చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ డాక్టర్ నక్కా సత్యనారాయణ, శ్రీ వత్సవాయి బాబు, కాకినాడ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మొయ్యేటి సూర్యప్రకాశరావు, కొండా శ్రీను పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని వినతిపత్రాన్ని సబ్‌స్టేషన్ అధికారులకు అందజేశారు. పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను, స్థానికులు కందిమళ్ళ శామ్యూల్, ఇరుగల చక్రం మూరానాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడిని టీటీడీ పాలక మండలి సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తిరుమలలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తిరుమల పవిత్రత, టీటీడీ దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని నెహ్రూ తెలిపారు. జ్యోతుల అనీష్ నెహ్రూ, భూపాలపట్నం ప్రసాద్ పాల్గొన్నారు.



చైర్మన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్‌కుమార్

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై
అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

రంపచోడవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : గిరిజన మహిళపై దాడిచేసి కులం పేరుతో దూషించిన వ్యక్తిని తక్షణమే అరెస్టుచేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈమేరకు మంగళవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. భూసారపు శ్రీదేవి అనే గిరిజన మహిళ పొలాన్ని అక్కిన బాలు అక్రమించాలనే ఉద్దేశంతో గత శనివారం సదరు మహిళ ఇంటికి వెళ్లి ఆమెపై దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించాడని పేర్కొన్నారు. సదరు విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించేకోలేదన్నారు. దీనిపై జాతీయ ఎస్టీ కమిషన్, రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు మూడవ విష్ణు నాయక్, ప్రధాన కార్యదర్శి పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి, సవలం బాపిరాజు, కుర్ల రాజశేఖర్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తుల వెంకటరమణారెడ్డి, పల్లాల భూపతిరెడ్డి, కత్తుల రత్నారెడ్డి, ఆదాల లింగారెడ్డి, పొడియం శ్రీనుబాబు, ఆదాల సూర్యనారాయణ, వంతల అచ్చమ్మ, ఆవుల సుబ్బమ్మ, కత్తుల శేఖర లక్ష్మీ, కొండల శివశంకర్‌రెడ్డి, మడకం రామన్నదొర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు, గిరిజన సంఘాల నాయకులు

ప్రత్తిపాడు అభివృద్ధికి సహకరించాలి



మంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు సహకారం అందించాలని రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మంత్రినారాయణను ప్రత్తిపాడు ఎమ్మెల్యేవరుపుల సత్యప్రభ రాజా కోరారు. మంగళవారం కాకినాడకు విచ్చేసిన మంత్రి నారాయణను కలిసి నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం- అప్పన్నపాలెం వంతెన పునఃనిర్మాణానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. ఈ వంతెన కుప్పకూలడంతో అప్పన్నపాలెం, ఏలేశ్వరం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. వీలైనంత త్వరగా వంతెన నిర్మాణం చేపట్టాలని చూడాలని, నియోజకవర్గంలోని సమస్యలు మంత్రికి వివరించారు. మంత్రి నారాయణను శాలువా కప్పి సన్మానించారు.

'భూమి దక్కేవరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తాం'

జగ్గంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం, మల్లిసాల మధ్యలో గల 575 ఎకరాల అడ్డకొండ భూమి ఎస్సీ, ఎస్టీలకు దక్కేవరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం గండేపల్లి మండలం కె.గోపాలపురం గ్రామంలో నిరుపేదలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నిరుపేదలకు అన్యాయం చేయకుండా అర్హులైనవారికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశల వారీగా పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.రాజబాబు, బి.రమేష్, నాయకులు రామలింగేశ్వరావు, డి.సురేష్, అంజిబాబు, కడితి సతీష్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్,వేమగిరి వెంకటేశులు, నాగార్జున, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'తప్పు చేస్తే శిక్ష తప్పదు'

గండేపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బంధుత్వాలు చూసుకోకూడదని తప్పు చేసిన వారికి శిక్ష పడాలి అని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన ఇటీవల చేసిన వ్యాఖ్యలపై జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ స్పందించారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తప్పు చేసిన ప్రతీ ఒక్కరూ శిక్ష అనుభవించాలన్నారు. పవన్ వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా అందరూ స్పందించారన్నారు. మన అనే బేధం లేకుండా ప్రతీ ఒక్కరినీ ఆయన ప్రశ్నిస్తారని, తప్పును తప్పుగా పరిణగించాలనేది ఆ వ్యాఖ్యల్లో అర్థమన్నారు.

'ప్రకృతి వ్యవసాయంపై దృష్టి'

కోటనందూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని అల్లిపూడి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అల్లిపూడిలో ఎక్కువ రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని కషాయిలతో పంటలు పండించున్నారన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలను ప్రతీ రైతు సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శివకుమారి, సురేష్, రైతులు తదితరులున్నారు.

'ఓటు నమోదు చేసుకోవాలి'

ఏలేశ్వరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ పట్టభద్రుల ఓటు హక్కును విధిగా నమోదు నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ కోరారు. మంగళవారం గ్రామీణ ప్రాంత పట్టభద్రుల దరఖాస్తులను తహశీల్దార్ వెంకటేశ్వరరావుకు బీజేపీ శ్రేణులు అందజేశారు. ఎమ్మెల్సీ ఓటుకు త్వరగా నమోదు చేసుకోవాలన్నారు. గట్టెం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు

కిర్లంపూడి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో భూపాలపట్నంలో సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 4 అర్జీలు రాగా కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతావి కూడా పరిష్కరిస్తామన్నారు. సర్వే డీటీ శ్రావణి, ఆర్ఐ సత్యదేవి, వీఆర్వో నూకరాజు ఉన్నారు.